
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
శనివారం 3 ఫిబ్రవరి 2024



నామినేటెడ్‌పై నజర్

నియామక పదవులపై కాంగ్రెస్ ఉమ్మడి వరంగల్ జిల్లా నేతల ఆశలు

- రాష్ట్ర, జిల్లా స్థాయి పోస్టులపై పలువురి దృష్టి
- జిల్లా గ్రంథాలయ చైర్మన్ పదవికి డిమాండ్
- మార్కెట్ చైర్మన్లు, రైతు సమన్వయ సమితుల కోసమూ ప్రయత్నాలు
- నేతల ప్రసన్నానికి ద్వితీయ శ్రేణి కేడర్ ప్రదక్షిణలు
- పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్‌కు ముందే భర్తీలుంటాయని ప్రచారం

వరంగల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : కాంగ్రెస్‌లో నామినేటెడ్ పోస్టుల భర్తీపై ఉత్కంఠ కొనసాగుతోంది. పదేళ్ల తరువాత కాంగ్రెస్ అధికారంలోకి రావటంతో రాష్ట్ర, జిల్లా స్థాయిలో కీలక పదవులపై నేతలు దృష్టి పెట్టారు. సుదీర్ఘకాలం గా కాంగ్రెస్‌లో పని చేస్తున్న నేతలతోపాటు గత అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ దక్కని వారికి నామినేటెడ్ పదవులతో సంతృప్తి పరిచేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ఆయా నియోజకవర్గాల్లో నామినేటెడ్ పదవులను ఎవరెవరికి ఇవ్వాలో కాంగ్రెస్ అధిష్ఠానం ఓ జాబితాను సిద్ధం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో కీలకమైన పోస్టులను దక్కించుకునేందుకు సీనియర్లు అధిష్ఠానం పెద్దల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. దీంతో ఎవరికి ఏ పదవి దక్కుతుందోనన్న చర్చ జరుగుతోంది.

రాష్ట్రస్థాయి పదవులపై ఆశలు

సుదీర్ఘకాలంగా పార్టీలో పనిచేస్తున్న నేతలకు సముచిత స్థానం కల్పించాలని అధిష్ఠానం నిర్ణయించినట్లు వస్తున్న సమాచారంతో గత అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ దక్కని నేతలు తమకు రాష్ట్రస్థాయిలో చైర్మన్ పదవులు కావాలని ఒత్తిడి తెస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే మహబూబాబాద్ జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే వేంనరేందర్‌రెడ్డిని సీఎం రేవంత్ రెడ్డి ప్రధాన సలహాదారుడిగా నియమించడంతో మిగతా నేతలకు కూడా కీలక పదవులపై ఆశలు చిగురిస్తున్నాయి. జనగామ నుంచి పోటీ చేసి ఓడిపోయిన కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, వరంగల్ మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణలతో పాటు గత ఎన్నికల్లో పరకాల టికెట్ ఆశించిన మాజీ మావోయిస్టు, భూపాలపల్లికి చెందిన టీపీసీసీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్ అలియాస్ ఐతూ, ఆత్మకూరుకు చెందిన ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి, వర్ధన్నపేట టికెట్ ఆశించిన నమిండ్ల శ్రీనివాస్ తదితరులు రాష్ట్రస్థాయిలో కార్పొరేషన్ చైర్మన్ పదవులను ఆశిస్తున్నారు. వీరితోపాటు వరం గల్ ఎంపీ టికెట్ రేసులో ఉన్న మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, జంగా రాఘవరెడ్డి కూడా రాష్ట్రస్థాయి పదవుల కోసం పట్టుపడుతున్నారని సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా 54 నామినేటెడ్ పోస్టులు ఉండగా, ఉమ్మడి వరంగల్ నుంచే అత్యధికంగా పోటీ పడుతుం డటం అధిష్ఠానానికి ఒకింత పరీక్షగా మారిందన్న అభిప్రాయాలున్నాయి. ఈ క్రమంలో ఎవరికి రాష్ట్రస్థాయిలో పదవులు ఇవ్వాలో అనేదానిపై మంత్రులతో చర్చిసున్నట్టు తెలుస్తోంది.

జిల్లా చైర్మన్ పదవులు దక్కేదెవ్వరికో?

నామినేటెడ్ పోస్టుల కోసం కాంగ్రెస్ పార్టీలో తీవ్ర పోటీ నెలకొంది. వరంగల్, హనుమకొండ జిల్లాల నుంచి బొద్దిరెడ్డి ప్రకార్‌రెడ్డి, ఈవీ శ్రీనివాస్, మీసాల ప్రకాష్, బత్తిని శ్రీనివాస్, ఎండీ అజీజ్‌ఖాన్, అబూబక్కర్, రవళిరెడ్డి, పాల్వాయి శ్రీనివాస్, రంజిత్‌రెడ్డి తదితరులు పోటీలో ఉన్నట్లు సమాచారం. వీరితోపాటు మరికొంత మంది సీనియర్ నేతలు మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్‌నాగరాజు, దొంతి మాధవరెడ్డి, రేవూరి ప్రకాష్‌రెడ్డిపై నామినేటెడ్ పోస్టుల కోసం ఒత్తిడి తీసుకొస్తున్నారు. అలాగే జనగామ జిల్లా నుంచి సుధాకర్, వి.సత్యనారాయణరెడ్డి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ ధన్వంతి భర్త లక్ష్మీనారాయణనాయక్, ముత్తినేని సోమేశ్వర్‌రావు, ఎన్.ప్రవీణ్‌రావు, మహబూబాబాద్ జిల్లా నుంచి బెల్లయ్యనాయక్, భరత్‌చంద్రారెడ్డి, నూనవాత్ రాధ తదితరులు రాష్ట్ర, జిల్లా స్థాయిలో నామినేటెడ్ పదవులను ఆశిస్తున్నారు. భూపాలపల్లి, ములుగు జిల్లాల నుంచి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఐతే ప్రకాష్, సినీ డైరెక్టర్ దామోదర్‌గౌడ్, అప్పం కిషన్, రాంనర్సింహరెడ్డి, ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్, గొల్లపల్లి రాజేందర్ తదితరులు నామినేటెడ్ పోస్టుల రేసులో ఉన్నారు.

ఈ పదవులపైనే నేతల కన్ను

జిల్లా స్థాయిలో నామినేటెడ్ పోస్టులను ఆశిస్తున్న నేతలు కీలక పదవులపై దృష్టిసారించారు. ముఖ్యంగా వరంగల్ నగరంలోని కూడా పోస్టుపై కీలక నేతలు కన్నేశారు. అత్యంత కీలకమైన పదవి కావటంతో కాంగ్రెస్‌లోని ముఖ్యనేతలు కూడా చైర్మన్ పదవి ఆశిస్తున్నారు. జంగా రాఘవరెడ్డి, ఎర్రబెల్లి స్వర్ణ, ఈవీ శ్రీనివాస్, బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి లాంటి కీలక నేతలు కూడా చైర్మన్ పదవి ఆశిస్తున్నారనే చర్చ జరుగుతోంది. ఇక వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌పదవిపై కూడా కీలక నేతలు ఆశిస్తున్నారు. అలాగే జిల్లాల్లో అత్యంత కీలకమైన పదవిగా జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ పదవిపై ఎక్కువ మంది ఆశిస్తున్నారు. నెలనెల వేతనంతో పాటు వాహనం అలవెన్స్ కూడా ఇస్తుండటంతో ఎక్కువమంది గ్రంథాలయ చైర్మన్ పదవిపై ఆశతో ఉన్నారు.

అలాగే గత ప్రభుత్వం తీసుకవచ్చిన రైతు సమన్వయ సమితిలపై సందిగ్ధం కొనసాగుతోంది. ఈ పదవులను ప్రస్తుత ప్రభుత్వం కొనసాగిస్తుందా? లేదా అనేది చర్చనీయాంశంగా మారింది. ఈ పదవులను కొనసాగిస్తే జిల్లా సమన్వయ సమితి అధ్యక్ష పదవితో పాటు మండల స్థాయిలోనూ కమిటీలతో చాలా మందిని నామినేటెడ్ పోస్టుల్లో భర్తీ చేసే అవకాశం ఉంది. వీటితో పాటు జిల్లా కేంద్రాలతో పాటు ముఖ్యపట్టణాల్లో ఉన్న వ్యవసాయ మార్కెట్లు, దేవాలయాల చైర్మన్ పదవులపై కూడా నేతలు దృష్టి సారించారు. మొత్తానికి పదేళ్ల తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పార్టీలో నామినేటెడ్ పదవుల జోష్ నెలకొంది.

పదేళ్లుగా ఎదురుచూపులే..

కాంగ్రెస్ శ్రేణులకు నామినేటెడ్ పోస్టులను కట్టబెట్టేందుకు పార్టీ అధిష్ఠానం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ఆయా జిల్లాల నుంచి అర్హుల జాబితాను తయారు చేసినట్టు ప్రచారం జరుగుతోంది. వచ్చే పార్లమెంట్ ఎన్నికలలోపే ఈ పోస్టులు భర్తీ చేస్తే కేడర్ ఉత్సాహంగా పని చేస్తుందని అధిష్ఠానం భావిస్తున్నట్టు సమాచారం. ఈ మేరకు ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లాకు చెందిన మంత్రులు కొండా సురేఖ, అనసూయ సీతక్కతో ఇప్పటికే నామినేటెడ్ పోస్టుల భర్తీ విషయమై చర్చించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో త్వరలోనే నామినేటెడ్ పదవుల భర్తీ ఉంటుందనే ప్రచారం ఆశావహుల్లో ఉత్కంఠ రేపుతోంది.



మేడారంలో ముమ్మరంగా విద్యుత్ పనులు

- జాతరలో నిరంతరాయ సరఫరాకు ప్రత్యేక చర్యలు
- రూ.16 కోట్లతో పనులు.. ఇప్పటికే 99 శాతం పూర్తి
- 200 ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు.. 425 మంది సిబ్బంది నియామకం
- తీగలు తెగిపడకుండా ప్లాస్టిక్ పేసర్లు
- సీజీఎం, ఇన్‌చార్జ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) మోహన్‌రావు వెల్లడి



7

బావిలో పడి చిన్నారి మృతి

- ఆడుకుంటూ వెళ్లి పడిన బాలుడు
- నెక్కొండలో ఘటన
- బతుకుదెరువు కోసం మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన కుటుంబం



కార్తీక్ మృతదేహం

నెక్కొండ, ఫిబ్రవరి 2 : ఇంటి ఆవరణలో ఒంటరిగా ఆడుకుంటున్న చిన్నారి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందిన సంఘటన శుక్రవారం నెక్కొండలో చోటుచేసుకుంది. ఎస్సై షెక్ జాన్‌పాషా, స్థానికుల కథనం ప్రకారం. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాజు బగేల్-రజని దంపతులు బతుకుదెరువు కోసం ఆరు నెలల క్రితం నెక్కొండకు వచ్చారు. వీరికి కార్తిక్ (22 నెలలు) ఒక్కగానొక్క కుమారుడు. నెక్కొండలోని రామాలయం వీధిలో అద్దె ఇంట్లో ఉంటున్న రాజు కుటుంబం పానీపూరి వ్యాపారం చేసుకుంటున్నారు. రాజు వ్యాపార నిమిత్తం ఇంటి నుంచి వెళ్లగా రజిని ఇంట్లో పనులు చేసుకుంటోంది. ఈక్రమంలో వారి కుమారుడు కార్తిక్ ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. ఇంటి ముందు ఉన్న బావికి చుట్టూ గోడ లేకపోవడంతో నేలకు సమాంతరం ఉంది. బాలుడు ఆడుకుంటూ వెళ్లి బావిలో పడ్డాడు. నీటి శబ్దాన్ని విన్న తల్లి బిగ్గరగా ఏడుస్తుండడంతో స్థానికులు వచ్చి బాలుడిని బావి నుంచి బయటకు తీసే ప్రయత్నం చేశారు. బావిలో నీరు ఉండటంతో నీటమునిగిన బాలుడు కొద్దిసేపటికే మృతి చెందాడు.

సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై నర్సంపేట అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు బావిలో నీటిని తోడి అనంతరం మృతదేహాన్ని బయటకు తీశారు. తల్లిదండ్రులకు కార్తీక్ ఒక్కరే కుమారుడు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు గుండెలు బాదుకుంటూ రోదించడం అక్కడివారిని కంటతడి పెట్టించింది.

దరఖాస్తుల ఆహ్వానం

నెక్కొండ, ఫిబ్రవరి 2 : నెక్కొండ ఆదర్శ పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఈనెల 22 తేదీలోపు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రణయ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఆరో తరగతిలో వంద సీట్లకు, 7 నుంచి 10వ తరగతిలో ఖాళీలను అనుసరించి ప్రవేశాలను పొందవచ్చని వివరించారు. ఆరో తరగతిలో ప్రవేశాలకు ఏప్రిల్ 7న ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, 7 నుంచి 10వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రవేశ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు పాఠశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలన్నారు.



విద్యుత్‌కాంతుల్లో దర్గా

సందల్ సందడి

- మాషూక్ రబ్బాని దర్గా ఉర్సు షురూ
- వివిధ రాష్ట్రాల నుంచి భక్తుల రాక
- ఉర్సులో ఆధ్యాత్మిక వాతావరణం

కరీమాబాద్, ఫిబ్రవరి 2: నగరంలోని అండర్ రైల్వే గేటు ప్రాంతంలోని కరీమాబాద్ ఉర్సు సయ్యదాన హజ్రత్ మాషూక్ రబ్బాని రహమతుల్లా అలై దర్గా 468వ ఉత్సవాలు శుక్రవారం రాత్రి అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మాషూక్ రబ్బాని రహమతుల్లా అలై 13వ తరానికి చెందిన వారసులు దర్గా పీఠాధిపతులు సయ్యద్ షా హైదర్ హిలాలోద్దిన్ ఖాద్రీ నవీద్ బాబా, సయ్యద్ షా హైదర్ హిలాలోద్దిన్ ఖాద్రీ ఉబేద్ బాబాల ఆధ్వర్యంలో అర్ధరాత్రి 12 గంటల తర్వాత నయాగడి నుంచి సందల్ (గంధలేపనం) ఉత్సవాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చారు. దర్గాలోని పవిత్ర సమాధికి సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేసి ఉత్సవాలను ప్రారంభించారు. వేడుకల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది పాల్గొన్నారు. భక్తుల రాకతో ఉర్సు దర్గా ప్రాంతం కిక్కిరిసిపోయింది. దర్గా పీఠాధిపతులు సందల్ తీసుకువస్తున్న సందర్భంలో భక్తి పారవశ్యంతో ఫకీర్ల ఒళ్లు గగుర్పొడిచే విన్యాసాలు ఆకట్టుకున్నాయి. మూడు రోజులపాటు సాగే ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారని, దీనికి అనుగుణంగా ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. కాగా, ఉత్సవాల్లో మేయర్ గుండు సుధారాణితోపాటు 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి, జబ్బార్, మగ్దూమ్ తదితరులు ఉన్నారు.

భారీ పోలీసు బందోబస్తు...

ఉర్సు మాషూక్ రబ్బాని దర్గా ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న వేలాది భక్తులతో ఉర్సు దర్గాప్రాంతం పోటెత్తింది. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుల భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. దర్గా ప్రాంతంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా దర్గా సమీపంలో నాలుగు వైపులా రహదారులను మూసివేసి వాహనాలను దారి మళ్లించారు. వరంగల్ ఏసీపీ బోనాల కిషన్ నేతృత్వంలో మిల్స్‌కాలనీ పోలీసుల ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్న మేయర్ సుధారాణి

పనుల్లో వేగం పెంచండి

- జిల్లాస్థాయి ఆస్పత్రి పనులు త్వరగా పూర్తిచేయాలి..
- మూడు నెలల్లో ఒక బ్లాక్‌ను అందుబాటులోకి తేవాలి..
- నర్సంపేటలో అధికారులను ఆదేశించిన కలెక్టర్ ప్రావీణ్య

నర్సంపేట, ఫిబ్రవరి 2: జిల్లా స్థాయి ఆస్పత్రి భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, మిగిలిన పనులను మూడు నెలల్లో పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. శుక్రవారం నర్సంపేట పట్టణ శివారులో నూతనంగా చేస్తున్న జిల్లాస్థాయి ఆస్పత్రి భవన నిర్మాణ పనులను అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఆస్పత్రికి సంబంధించిన నక్షను అధికారులు వివరించారు. మూడు బ్లాకుల్లో ఒక బ్లాక్ పూర్తి కావచ్చిందని ఇంజనీరింగ్ అధికారులు కలెక్టర్‌కు వెల్లడించారు. రూ.70కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న జిల్లాస్థాయి (250 పడకల) ఆస్పత్రి నిర్మాణ పనులు 80శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులను మూడు నెలల్లో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. ఆస్పత్రికి సంబంధించిన 220 పడకలు, వైద్య కళాశాలకు సంబంధించిన ఫర్నిచర్, హాస్టల్ వసతి తదితర విభాగాలు ఏ ప్రాంతంలో ఉండాలో సూచించే నమూనాను కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ పనుల్లో అలసత్వం చేయకుండా శరవేగంగా పూర్తిచేయాలన్నారు. మూడు బ్లాకలలో ఒక బ్లాక్ నిర్మాణ పనులను వెంటనే పూర్తి అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. ఆస్పత్రి, వైద్య కళాశాలకు సంబంధించిన అంశాలపై వైద్య, ఇంజనీరింగ్ అధికారులతో సమావేశాన్ని నిర్వహించి అధికారుల ద్వారా సమాచారం తెలుసుకొని వారికి కలెక్టర్ సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణవేణి, తహసీల్దార్ శివప్రసాద్, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపాల్, ఆర్ఎంఓ డాక్టర్ మనోజ్‌లాల్, డీఎంహెచ్‌వో వెంకటరమణ, ఇంజనీరింగ్ శాఖ ఎస్ఈ దేవేందర్, డీఈ రాజశేఖర్, నర్సంపేట వైద్యకళాశాల ప్రిన్సిపాల్ బానోతు కిషన్, మహబూబాబాద్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

- జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలవాలని కలెక్టర్ అన్నారు. నర్సంపేట మండలం లక్నేపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ శుక్రవారం సందర్శించి ఓరియం టేషన్-24 కార్యక్రమాన్ని బోధిస్తున్న తీరును పరిశీలించారు.



నర్సంపేటలో ఆస్పత్రి నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

12 నుంచి నులి పురుగుల నివారణ మందుల పంపిణీ

వరంగల్ కలెక్టరేట్: జిల్లా వ్యాప్తంగా 12న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశాన్ని వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నులి పురుగు ఉన్నట్లయితే రక్తహీనత పోషకాహార లోపం, ఆకలి లేకపోవడం, కడుపునొప్పి వంటి బాధతతో ఉంటారన్నారు. ఒక సంవత్సరం నుంచి 19 సంవత్సరాల వయసు కలిగిన వారు జిల్లాలో 1810 ప్రభుత్వ ప్రైవేటుకు చెందిన పాఠశాలల్లో, కళాశాలల్లో సంక్షేమ వసతి గృహాల్లో 1,90,718 మంది విద్యార్థులకు ఆల్బెండా జోల్ మాత్రలు అందించనున్నట్లు తెలిపారు.

కార్యక్రమంలో డీఎంహెచ్‌వో కె.వెంకటరమణ, జడ్పీ సీఈవో రామిరెడ్డి, అడిషనల్ డిప్యూటీ డీఎంహెచ్‌వో, విద్యాశాఖ, డీఆర్‌డీ, మెప్మా, సోషల్ వెల్ఫేర్, ట్రైబర్ వెల్ఫేర్, మైనారిటీ వెల్ఫేర్, ఐఎంఏ అధికారులు పాల్గొన్నారు.

వైదిక సంప్రదాయాన్ని రక్షించాలి

- రాముడి రాక శుభదాయకం
- త్రిదండి చిన్నజీయర్ స్వామిజీ

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 2: వైదిక సంప్రదాయ సంరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని, అయోధ్యలో శ్రీరాముడు రావడం శుభదాయకమని పరమహంస పరివ్రాజకాచార్యావర్య త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామిజీ అన్నారు. వరంగల్ నగరంలో మూడు రోజుల కార్యక్రమాల్లో పాల్గొనడానికి గురువారం రాత్రి వరంగల్‌కు విచ్చేసిన చిన్నజీయర్ స్వామిజీ, పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇటీవల నగరంలోని గీతాభవన్‌కు చెందిన ప్రముఖ వేదపండితులు శ్రీమన్నారాయణ చార్యులు అకాల మృతి చెందగా శుక్రవారం గీతా భవన్‌లో పరమపదోత్సవం కార్యక్రమంలో చిన్నజీయర్ స్వామి మాట్లాడుతూ అయోధ్యకి రాముడు వచ్చాడని, ప్రపంచ వ్యాప్తంగా రాముడి ఆలయ ప్రారంభం పండుగలా చేసుకున్నారన్నారు. ఇప్పటి వరకు ఇల్లులేని రాముడికి ఓ ఇల్లు ఏర్పాటైందని శుక్రవారం అన్నారు. ముదుంబై కుటుంబం వారు సంప్రదాయ కట్టుబొట్టుతో నియమనిష్ఠలతో నేటికి వైదిక సంప్రదాయాన్ని పాటిస్తూ అందరికి ఆదర్శంగా నిలిచారన్నారు. సనాతన ధర్మం కోసం వారు చేసిన సేవలను కొనియాడారు. వారు తొందరగా వైకుంఠానికి వెళ్లడం భక్తులను బాధకు గురి చేసిందన్నారు. కాగా శ్రీమన్నారాయణచార్యులు సంస్మరణ సభకు ఐదుగురు జీయర్ పీఠాధిపతులు (అష్టాక్షరి జీయర్ స్వామిజీ, ఆహోబిలం జీయర్ స్వామిజీ, రామచంద్ర రామానుజ జీయర్ స్వామిజీ, దేవనాథ జీయర్ స్వామిజీ) హాజరయ్యారు.



కార్యక్రమంలో పాల్గొన్న చిన్న జీయర్ స్వామిజీ

నేడు సమతా దీక్ష ప్రారంభం

ప్రపంచ శాంతి కోసం, నేను.. నా ప్రపంచం బాగుండాలనే నినాదంతో భగవత్ రామానుజచార్యులు నిర్వహించిన సమత సందేశాన్ని ప్రపంచానికి తెలిసేలా సమతా దీక్షను నగరంలో నేడు ప్రారంభిస్తున్నట్లు చిన్నజీయర్ స్వామిజీ తెలిపారు. శనివారం కొత్తవాడ బ్యాంకు కాలనీ నుంచి సీకేఎం కళాశాల వరకు సమతా దీక్ష ప్రారంభ ర్యాలీని నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. 27రోజుల పాటు కొనసాగే సమతా దీక్ష ముగింపు హైదరాబాద్‌లోని శంషాబాద్ సమతా కేంద్రంలో నిర్వహిస్తామన్నారు. ర్యాలీలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాలని వరంగల్ వికాస్ తరంగిణి నిర్వాహకులు డాక్టర్ బచ్చు మురళీకృష్ణ కోరారు.

ఇంటర్ యూనివర్సిటీ జూడో జట్టు ఎంపిక


క్రీడాకారులతో ప్రొఫెసర్ వెంకయ్య

కేయూక్యాంపస్, ఫిబ్రవరి 2: ఈ నెల 5,6 తేదీల్లో పంజాబ్ అమృతసర్ గురు నానకదేవ్ యూనివర్సిటీలో జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్ 2023-24 ఏడాదికి గాను కాకతీయ యూనివర్సిటీ , స్త్రీ, పురుషుల జూడో జట్టును ఎంపిక చేసి ప్రకటించినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య శుక్రవారం తెలిపారు. జట్టుకు హనుమకొండ జాగృతి డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎ.రాజేశ్ మేనేజర్‌గా వ్యవహరిస్తారని వెల్లడించారు. ఎంపికైన జట్టును కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి అభినందించారు.

చిందు కళకు గుర్తింపు తెచ్చిన ఘనత సమ్మయ్యదే..

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

దేవరుప్పుల, ఫిబ్రవరి 2: చిందు కళను దేశం గుర్తించే స్థాయికి తీసుకువచ్చిన ఘనత గడ్డం సమ్మయ్యదేనని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన కళారత్న, హంస అవార్డు గ్రహీత, చిందు యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్యను శుక్రవారం ఆయన స్వగ్రామమైన దేవరుప్పుల మండలం అప్పిరెడ్డిపల్లెలో మంద కృష్ణ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళను ప్రదర్శించింది చిందు సమాజం అయితే తరతరాలుగా ఆ కళను పోషించింది, గౌరవించింది, కాపాడుకున్నది మాదిగ జాతేనన్నారు. చిందు యక్షగాన కళారూపాలలో సమ్మయ్య కృషి, ప్రతిభను ఆయన ప్రశంసిస్తూ 50ఏళ్ల తపస్సుతో కూడిన తన శ్రమతో, తన కళలతో, నటనతో రంగస్థలపాత్రలతో ప్రజలను అలరించారని కొనియాడారు. సమ్మయ్యకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 2కోట్లు ఇవ్వాలని, కళలను బతికించుకునేందుకు ప్రత్యేక భవనం నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో చిందు హక్కుల పోరాటసమితి జాతీయ అధ్యక్షుడు గజవెల్లి గణపతి, రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం వెంకటేశ్వర్లు, మాదిగ లాయర్ల ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు వీవీ రత్నం, ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్, జనగామ జిల్లా అధ్యక్షుడు గజవెల్లి వెంకన్న, చిందు విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గజవెల్లి ప్రతాప్, శరత్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పడమటింటి నర్సింహ, సైదులు, శ్రీనివాస్, యాదగిరి, రాములు, ఏసుపాదం, సమ్మయ్య కుమారులు గడ్డం సోమరాజు, హిమగిరి పాల్గొన్నారు.


అప్పిరెడ్డిపల్లెలో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ, చిత్రంలో యక్షగాన కళాకారుడు సమ్మయ్య, తదితరులు


మేడారంలో వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

వనదేవతలకు నిలువెత్తు మొక్కులు

లక్షకు పైగా తరలివచ్చిన భక్తులు ● సందడిగా మేడారం పరిసరాలు


జంపన్నవాగులో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

మేడారం, ఫిబ్రవరి 2: తాడ్వాయి మండలం మేడారంలో భక్తుల సందడి నెలకొంది. వివిధ రాష్ట్రాలకు చెందిన లక్షకు పైగా భక్తులు శుక్రవారం మేడారం తరలివచ్చి తల్లుల గద్దెలను దర్శించుకున్నారు. సమ్మక్క, సారలమ్మలకు ముందస్తు మొక్కులు చెల్లించుకున్నారు. తొలుత జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. వనదేవతల గద్దెలకు చేరుకొని అమ్మవార్లకు పూలు, పండ్లు, పసుపు కుంకుమ, చీరె, సారె, కొబ్బరికాయలు, నిలువెత్తు బంగారం(బెల్లం) ఇచ్చారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. సుమారు లక్ష మందికి పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని ఈవో రాజేంద్రం తెలిపారు. కాగా, మేడారం సమ్మక్క, సారలమ్మలకు మొక్కులు చెల్లించుకోవడానికి తరలివచ్చే భక్తులు నేరుగా తల్లుల గద్దెలను దర్శించుకోలేక పోయామని అసంతృప్తిని వ్యక్తం చేశారు. అలాగే తల్లుల కొంగు బంగారం(బెల్లం)గా భావించే ప్రసాదం దొరకడం లేదని అంటున్నారు. తల్లుల గద్దెలకు సమర్పించిన బంగారం ప్రసాదంగా అందాలని భక్తులు కోరుకుంటున్నారు. మేడారం వస్తున్న భక్తులకు తల్లును తాకే అవకాశం లేకుండా గద్దెలకు తాళాలు వేసి దేవాదాయ, పోలీసు శాఖ అధికారుల కుటుంబీకులకు మాత్రం ప్రొటోకాల్ దర్శనాలు కల్పిస్తున్నారని పలువురు భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు

బెల్ట్‌షాపులపై టాస్క్‌ఫోర్స్ దాడులు


తాటికొండలో పట్టుకున్న మద్యాన్ని చూపిస్తున్న పోలీసులు

హనుమకొండ క్రైం/స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 2: వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు రెండు చోట్ల నిర్వహిస్తున్న బెల్ట్‌షాపులపై మెరుపు దాడి చేశారు. ఈ దాడిలో సుమారు రూ.1.27లక్షల మద్యాన్ని పటుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలం తాటికొండ గ్రామానికి చెందిన మారపాక కరుణాకర్ అనే వ్యక్తి చాలా కాలంగా ఇంటినే అడ్డాగా చేసుకుని బెల్టుషాపు నిర్వహిస్తున్నట్టు పక్కా సమాచారం అందింది. దీంతో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది కరుణాకర్ ఇంటిపై దాడులు నిర్వహించి సుమారు రూ.1.20లక్షల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి పట్టుకున్న మద్యాన్ని స్టేషన్ ఘన్‌పూర్ పోలీసులకు అప్పగించారు. అదే విధంగా మడికొండ పోలీసు స్టేషన్ పరిదిలో తరాలపల్లిలో బెల్టుషాపుపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. గంగాపురం స్వరూప అనే మహిళ బెల్టుషాపు నిర్వహిస్తున్నట్టు పక్కా సమాచారం అందింది. సిబ్బంది స్వరూప ఇంటిపై దాడులు నిర్వహించి రూ. 6 వేల విలువ గల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న మద్యాన్ని సంబంధిత పోలీసులకు అప్పగించారు. ఈ దాడులలో టాస్క్‌ఫోర్స్ పోలీసులతో పాటు సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

గాంధీభవన్‌లో దరఖాస్తుల సమర్పణ



హైదరాబాద్ గాంధీభవన్‌లో దరఖాస్తు అందజేస్తున్న రామగళ్ల పరమేశ్వర్

హనుమకొండ సిటీ, ఫిబ్రవరి 2: వరంగల్ పార్లమెంట్ టికెట్ ఆశావహులు హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో దరఖాస్తులను సమర్పిస్తున్నారు. గడిచిన రెండు రోజుల్లో కొందరు ఇప్పటికే దరఖాస్తులను అందచేయగా శుక్రవారం మరి కొందరు టికెట్ కోసం అప్లికేషన్‌ను అందచేశారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు నమిండ్ల శ్రీనివాస్, డాక్టర్ పులి అనిల్‌కుమార్, డాక్టర్ రామగళ్ల పరమేశ్వర్‌తో పాటు ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ హరికోట్ల రవి, విద్యావేత్త డాక్టరు ఎనెళ్లి మురళీదర్శన్ తదితర ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. శనివారం గడువు ముగియనుండడంతో వరంగల్ పార్లమెంట్ టికెట్ రేసులో ఉన్న నేతలు దరఖాస్తులు అందచేసేందుకు సన్నద్ధమవుతున్నారు. రానున్న మూడు రోజుల్లో స్క్రీనింగ్ ప్రక్రియ కూడా ముగియనుండడంతో ఆశావహులు యత్నాలను ముమ్మరం చేశారు. గాడ్‌ఫాదర్లను ఆశ్రయిస్తూ ఢిల్లీలో మకాం వేస్తున్నారు. ఈ నెల 15 నుంచి 18 లోగానే అభ్యర్థుల ప్రకటన పూర్తి చేయాలనే సంకల్పంతో కాంగ్రెస్ అధిష్ఠానం ఉన్నట్లు తెలిసింది. మేడారం జాతరకు ముందే అభ్యర్థులను ఖరారు చేయడం ద్వారా పార్టీకి ప్రయోజనం చేకూరనుందనే అంచనాలు కాంగ్రెస్ నేతల్లో నెలకొన్నాయి.

సీపీని కలిసిన భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజు



సీపీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 2: వ్యక్తిగత పని నిమిత్తం వరంగల్ పోలీసు కమిషనరేట్‌కు వచ్చిన భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజ్ శుక్రవారం వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝాను కలిశారు. సీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు. శాంతిభద్రతల పరిరక్షణపై ఇద్దరు అధికారులు కాసేపు మాట్లాడుకున్నారు.

మేడారంలో ముమ్మరంగా విద్యుత్ పనులు

- జాతరలో నిరంతర కరెంట్ సరఫరాకు ప్రత్యేక చర్యలు
- పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్న సీఎండీ
- సీజీఎం, ఇన్‌చార్జ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) మోహన్‌రావు వెల్లడి



జాతర ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

హనుమకొండ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క - సారలమ్మ జాతరలో టీఎస్ ఎన్‌పీడీసీఎల్ విద్యుత్ పనులను ముమ్మరంగా చేస్తోంది. జాతరకు ఇంకా 20 రోజులు మిగిలుండగానే ఇప్పటికే 99 శాతం పనులు పూర్తయ్యాయని చీఫ్ జనరల్ మేనేజర్ (ఆపరేషన్స్), ఇన్‌చార్జి డైరెక్టర్ కూడా అయిన వి.మోహన్‌రావు వెల్లడించారు. మేడారం జాతరలో నిరంతరం విద్యుత్ సరఫరా ఏర్పాట్లు, విద్యుదాఘాత ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు, సిబ్బంది నియామకం, గత జాతర కన్నా ఈ సారి అదనంగా చేపడుతున్న పనులు తదితర అంశాలపై ఆయన 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

నాలుగు నెలల ముందు నుంచే..

అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడానికి ముందే మేడారం జాతరలో కరెంట్ సరఫరా పనులు మొదలు పెట్టాం. జాతర ప్రాంతంలో పొలాలు ఉండడం, కోతలు పూర్తికాపోవడంవల్ల అక్కడ పనులు చేపట్టడంలో కొంత ఆటంకం ఏర్పడింది. అయినా మొత్తానికి 99 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులను వచ్చే పది రోజుల్లో పూర్తి చేస్తాం.. జాతర ప్రాంగణంలో ఇప్పటికే విద్యుత్ సరఫరా పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చింది. గతంలోకన్నా ఈసారి మరిన్ని అదనపు ఏర్పాట్లు చేస్తున్నాం. జాతరలో భక్తులు విడిది చేసే ప్రాంతమంతటా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశాం. ఇప్పుడు అవసరాన్ని బట్టి కొన్నింటిని ఏర్పాటు చేశాం. జాతర సందర్భంగా మిగతా వాటన్నిటినీ ఉపయోగంలోకి తీసుకువస్తాం. దీని వల్ల కరెంట్ నష్టాలు తగ్గుతాయి.

రూ.16కోట్లతో..

జాతరలో రూ.16కోట్ల అంచనా వ్యయంతో కరెంట్ పనులు చేపట్టాం. జాతరలో 160 కేవీఏ, 100 కెవీఏ తదితర ట్రాన్స్‌ఫార్మర్లు సుమారు 200 వరకు ఏర్పాటు చేశాం. జాతరలో రెండు సబ్‌స్టేషన్లు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. అంతకుముందు తాడ్వాయి నుంచి చిన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కరెంట్‌ను తీసుకోవలసి వచ్చేంది. 2013లో కొత్తూరులో ఒకటి, ఆ తర్వాత మ్యూజియం దగ్గర మరోసబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశాం. ఇక్కడి నుంచి నాలుగు ఫీడర్లు వెళుతున్నాయి. వీటిలో ఒక ఫీడర్ ప్రత్యేకంగా అమ్మవారి గద్దెల వరకు వెళుతుంది. ఈ రెండు సబ్‌స్టేషన్ల నుంచి రెండు లైన్లు వేసాము. దీనితో కరెంట్ సరఫరాలో అంతరాయం కలగడం అనేది ఉండదు.

భక్తులు విడిది చేసే ప్రాంతమంతా..

గతంలోకన్నా ఇప్పుడు భక్తులరాక గణనీయంగా పెరిగింది. దీనితో జాతర విస్తీర్ణం కూడా పెరిగింది. దానిని దృష్టిలో పెట్టుకొని జాతరలో భక్తులు విడిది చేసే ప్రాంతమంతటా కరెంట్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. భక్తులు విడిది చేయడం కన్నెపల్లి నుంచి మొదలై అమ్మవారు బయలుదేరు చిలకలగుట్ట ఆ చుట్టుపక్కల ప్రాంతాల వరకు ఉంటుంది. ఈ మొత్తం ప్రాంతానికి కరెంట్ సరఫరా ఉండేలా లైన్లు వేశాం. ప్రధానంగా గద్దెల నుంచి అరకిలోమీటర్ వరకు పటిష్టమైన విద్యుత్ సరఫరా వ్యవస్థ ఎప్పటికీ అందుబాటులో ఉంటుంది.

ఆర్టీసీవారికి..



సీజీఎం మోహన్‌రావు

జాతరలో ఆర్టీసీకి సంబంధించి ఈ సారి కొన్ని అదనపు పనులను కూడా చేపట్టాం. ఆర్టీసీ గట్టమ్మవద్ద రెండు పార్కింగ్ స్థలాలను, అలాగే తాడ్వాయి వద్ద మరో హోల్డింగ్‌ను అదనంగా ఏర్పాటు చేస్తోంది. అక్కడ అవసరమైన విద్యుత్ సరఫరా ఏర్పాటు చేస్తున్నాం. గద్దెల తర్వాత భక్తుల రద్దీ ఎక్కువ ఉండేది జాతరలోని ఆర్టీసీ బస్‌స్టేషన్ల వద్దనే. దీనిని దృష్టిలో పెట్టుకొని ఆర్టీసీవారి సూచనల మేరకు విద్యుత్ సరఫరా ఏర్పాట్లు చేశాం. సరఫరాలో అంతరాయం కలుగకుండా ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశాం. సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు వెంటనే సరిచేయడానికి ప్రతీ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఒక ఉద్యోగి ఎప్పుడూ అందుబాటులో ఉంటారు. ఏ చిన్న సమస్య వచ్చిన సమాచారం అందగానే అవసరమైతే మరికొంత సిబ్బంది కూడా అక్కడికి వెళ్లి తక్షణం పరిష్కరించేలా ఏర్పాట్లు చేశాము.

425 మంది సిబ్బంది

నిరంతరం విద్యుత్‌ను సరఫరా చేయడమే కాకుండా మరింత మెరుగ్గా ఇచ్చేందుకు జాతరలో 425 మంది సిబ్బందిని నియమిస్తున్నాం. ఒక డైరెక్టర్ స్థాయి అధికారితో పాటు ఇద్దరు చీఫ్ ఇంజనీర్లు, ఏడుగురు డీఈలు, 15మంది అదనపు ఏడీలు, ఏఈలు, లైన్లుమన్లు ఓ అండ్‌ఎం స్టాఫ్ వీరిలో ఉన్నారు. వీరంతా జాతర జరిగే నాలుగు రోజులు రాత్రింబవళ్లు విధుల్లో ఉంటారు. వీరితోపాటు ఎక్కడైనా పోల్ విరిగినా, లైన్లలో అంతరాయం కలిగినా తన కూలీలతో ఆ పనులు పూర్తి చేయడానికి సంబంధిత కాంట్రాక్టర్‌ను కూడా అందుబాటులో ఉంచుతున్నాం.

అంతరాయం కలుగకుండా...

జాతరలో చిరువ్యాపారులు తీగలపై వైర్లు వేసి అక్రమంగా కరెంట్ వాడుకోవడం తరుచూ జరుగుతుంటుంది. దీని వల్ల ట్రాన్స్‌ఫార్మర్లపై అదనపు లోడు పడి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. దీనిని నివారించడానికి ఈ సారి అధునాతన సాంకేతికను వాడుతున్నాం. దీనికోసం ఎన్‌పీడీసీఎల్ ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించింది. ఎక్కడైనా తీగలపై వైర్లు వేసినా ఆ విషయం క్షణాల్లో జాతరలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు తెలుస్తుంది. సిబ్బందిని వెంటనే అప్రమత్తం చేసి దానిని నివారిస్తాం.

ప్రమాదాల నివారణకు..

జాతరలో ఇసుకవేస్తే రాలనంత జనం ఉంటారు. ఒత్తిడి తీవ్రంగా ఉంటుంది. ఈ క్రమంలో పోల్స్ దెబ్బతినో, మరేదైనా కారణంవల్ల కరెంట్ వైర్లు తెగి భక్తులపై పడకుండా నివారించేందుకు ప్రతీ మూడు మీటర్లకు ఒక ప్లాస్టిక్ ఫేసర్‌ను వైర్లపై ఏర్పాటు చేస్తున్నాం. వైర్లు సుమారు 17 మీటర్ల ఎత్తులో ఉంటాయి. ప్రమాదవశాత్తు ఎక్కడైనా వైర్ తెగినా అది భక్తులకు తగలనంత ఎత్తులోనే వేలాడుతుంటాయి. దీనివల్ల భక్తులు విద్యుదాఘాతానికి గురయ్యే ప్రమాదం ఉండదు.

సిబ్బందికి వసతి

జాతరలో పనిచేసే విద్యుత్ అధికారులు, సిబ్బంది కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రతీ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఒకటి చొప్పున 40వరకు టెంట్లు వేస్తున్నాం. ఒక్కో టెంట్‌లో ఐదుగురికి వసతి ఉంటుంది. వీరు విధి నిర్వహణ అనంతరం ఇందులో విశ్రాంతి తీసుకోవచ్చు. అంతేకాకుండా సిబ్బందికి భోజన వసతి కోసం జాతరలోని రెండు సబ్‌స్టేషన్ల వద్ద ఫుడ్ కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నాం.

సీఎండీ ప్రత్యక్ష పర్యవేక్షణ

ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి మేడారం జాతరలో కరెంట్ పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తు న్నారు. కరెంట్ సరఫరా ఏర్పాట్లు సకాలంలో పూర్తయ్యేలా మార్గదర్శనం చేస్తున్నారు. ఇప్పటికే రెండుసార్లు మేడారం సందర్శించి పనుల పరోగతిని సమీక్షించారు. ఎన్‌పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సమీక్ష సమావేశాలు నిర్వహించి పనుల ప్రగతిని అడిగి తెలుసుకుంటున్నారు. గత జాతర కన్నా ఈసారి విద్యుత్ సరఫరా ఏర్పాట్లు మరింత మెరుగ్గా ఉండేలా అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వం నుంచి కొంత మేరకు నిధులు అందాయి. మిగతా వాటిని ఎన్‌పీడీసీఎల్ సంస్థ భరిస్తోంది. జాతరలో దుకాణాలకు కరెంట్ సరఫరా చేయడం వల్ల వచ్చే ఆదాయం ఏమంత ఎక్కువగా ఉండదు. అయినా కూడా భక్తుల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని వీలైనంత మేరకు శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నాం.



విద్యుత్ స్తంభానికి వైరు సరిచేస్తున్న సిబ్బంది

ఎన్నికల వేళ.. 'ఉక్కు'వేడి

- మళ్లీ తెరపైకి బయ్యారం పరిశ్రమ అంశం
- చివరి బడ్జెట్‌లోనూ ఊసెత్తని కేంద్రం
- పదేళ్లుగా మీనమేషాలు లెక్కించిన బీఆర్‌ఎస్
- కాంగ్రెస్‌పైనే నిరుద్యోగుల ఆశలు

మహబూబాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : అపార ఖనిజ సంపదతో విరాజిల్లుతున్న మానుకోట ప్రాంతం ఎందుకు వెనుకబడింది. ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లేక యువత దేనికి విలవిల్లాడుతోంది? ఆరు దశాబ్దాల తెలంగాణ ఉద్యమం వెనుక నీళ్లు, నిధులు, నియామకాలు కీలకం ఎందుకయ్యాయి. మడిమ తిప్పని మలిదశ ఉద్యమ పోరాట ఫలితంగా కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వం తెలంగాణ ఇవ్వడం.. సాధన ఉద్యమ పార్టీగా బీఆర్‌ఎస్ పదేళ్ల పాలించడం.. ఇవన్నీ వరుసగా జరిగిన పరిణామాలు..! తాజాగా గురువారం ప్రవేశపెట్టిన చివరి పార్లమెంట్ బడ్జెట్‌లోనూ తెలంగాణ ఉక్కు ఊసేలేకుండా పోయింది. దీనికి ముందే కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే విభజన చట్టంలోని హామీలు నేరవేర్చుకోగలమని ఇటీవలనే సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేయడంతో తెలంగాణ ఉక్కు అంశాన్ని కాంగ్రెస్ రేపటి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధానాస్త్రంగా సంధించబోతుందన్న సంకేతాలు కన్పిస్తున్నాయి. ఉక్కు పరిశ్రమ నినాదం ప్రతీ ఎన్నికల్లో ఓట్లను కొల్లగొట్టే హామీగానే మిగిలిపోతూ వస్తున్న క్రమంలో ఈ పార్లమెంట్ ఎన్నికల పోరులో బయ్యారం ఉక్కు వేడి మరింత రాజుకోబోతోంది. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ రాష్ట్ర అధికారంలో ఉన్న దరిమిలా విభజన చట్టంలోని ఉక్కు పరిశ్రమ హామీ ఇకనైనా అమలురూపం దాల్చేలా కార్యాచరణ చేపట్టే బాధ్యత తీసుకుంటుందని యువత ఆశిస్తోంది.

ఉక్కు వెనక నడిచిన తతంగమిదీ..

రాష్ట్ర పునర్విభజన చట్టంలోని తెలంగాణ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు రెండుసార్లు జరిగిన పార్లమెంట్ ఎన్నికల నెరవేరని వాగ్దానాలుగానే మిగిలిపోయాయి. సుదీర్ఘకాలంగా సర్వేలపై సర్వేలతో పదేళ్ల పాటు నానుస్తూ వచ్చిన కేంద్రంలోని బీజేపీ, కేంద్రం కాదంటే సింగరేణి ద్వారానైనా పరిశ్రమ ఏర్పాటు చేస్తామన్న పూర్వ తెలంగాణ ప్రభుత్వ ప్రకటనలు ఎన్నికల హామీలుగానే మిగిలిపోయాయి. తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన ఏకైక ఉక్కుపరిశ్రమ అంశాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరుగున పడేశాయి. బయ్యారం ఇనుప ఖనిజం నిక్షేపాల వెలికితీతకు ఆరు దశాబ్దాల కిందటి చరిత్ర ఉంది. 1952లో తొలిసారిగా బయ్యారంలో మినీ ఉక్కుకర్మాగారం ఏర్పాటు చేసి కొంతకాలం పాటు ఇనుప ఖనిజాన్ని వెలికితీశారు. అలా వెలికితీసిన ఖనిజాన్ని ఇతర రాష్ట్రాలతో పాటు జపాన్‌కు ఎగుమతి చేసేవారు. తర్వాత ఏ కారణం చేతనో కానీ ఇనుప ఖనిజం వెలికితీత పనులు నిలిచిపోయ్యాయి. ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్సార్ ప్రభుత్వ హాయంలో 2004 నుంచి 2009వరకు 5ఏళ్ల పాటు ఖనిజాన్ని మళ్లీ వెలికిసి, ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో బయ్యారం ఉక్కు అంశం కీలకంగా మారడంతో అప్పటి యూపీఏ ప్రభుత్వం రాష్ట్రం విభజన చట్టంలో ఖమ్మం జిల్లాలో స్టీల్ పరిశ్రమ ఏర్పాటు అంశాన్ని జోడించింది. ఆ దిశగా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు పలుమార్లు సర్వేలు జరిపారు. పలు సంస్థలు చేపట్టిన సర్వేల్లో కూడా స్టీల్ ప్లాంట్ ఏర్పాటు దిశగానే సానుకూలత రిపోర్టు వచ్చినట్లు ప్రకటనలు ఊరించాయి.

బీఆర్‌ఎస్ అలాగో.. ఇలాగో.. చేస్తానని..

స్వరాష్ట్ర ఆవిర్భావం నుంచి ఉక్కుఫ్యాక్టరీపై నానుస్తూ వచ్చినా కేంద్రం కుదరదని సుప్రీంకోర్టులో తేల్చిచెప్పడంతో గత సర్కార్ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఇతర ప్రజాప్రతినిధులు కేంద్రం ఒప్పుకున్నా లేకున్నా ఎట్టి పరిస్థితుల్లో స్టీల్ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టి తీరుతామంటూ ప్రకటనలు చేశారు. సింగరేణి సంస్థతో పాటు టీఎస్ఎండీసీతో ఖనిజ నాణ్యత, పరిమాణంపై సర్వేలు కూడా చేయించారు. ఇక్కడ సరిపడ ఖనిజం లేకపోయినా పక్క రాష్ట్రం ఛత్తీస్‌గఢ్ బైలడిల్లా నుంచైనా సరే ముడి సరుకును దిగుమతి చేసుకొని బయ్యారంలో స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి తీరుతామని హామీలు గుప్పించారు. ఒకానొక సందర్భంలో హైదరాబాద్ వచ్చిన కేంద్రమంత్రి బీరేందర్ సింగ్ కూడా తెలంగాణ వాదులకు తీపి కబురంటూ ఖమ్మం జిల్లా స్టీల్ ఫ్యాక్టరీపై ప్రకటనలు చేశారు. అంతా ఉత్తుత్తే అయిపోయింది. సుమారు 300 మిలియన్ మెట్రిక్ టన్నుల అపార ఇనుప ఖనిజ నిక్షేపాలు బయ్యారంలో ఉన్నాయన్న జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా నివేదికలు ఒకవైపు ఉన్నప్పటికీ కేంద్రం నాణ్యమైన ఐరన్‌ఓర్ బయ్యారంలో లేదని చెప్పడంతో ఉక్కు సంకల్పం ఉట్టికెక్కింది.





రాజుకుంటున్న ఉక్కు నినాదం..

స్వరాష్ట్రంలో మూడోసారి పార్లమెంట్ ఎన్నికల వేడిలో 'ఉక్కు పరిశ్రమ' హామీ రాజుకుంటోంది. కేంద్రంలోని బీజేపీ రెండుదఫాలు బయ్యారం ఉక్కుపై ఎటు తేల్చకుండానే పక్కన పెట్టేసింది. రాష్ట్రంలో సైతం ఉద్యమ ఆకాంక్షతో అధికారం చేపట్టిన బీఆర్‌ఎస్ కూడా దాటవేత ధోరణిలో అంకితభావాన్ని విస్మరించింది. నాడు తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఇందులో తెలంగాణ ఉద్యమ నేత ప్రొఫెసర్ కోదండరాం కూడా భాగస్వామ్యం వహించడం దాదాపు ఖరారైన క్రమంలో నిరుద్యోగ యువతలో ఉక్కు పరిశ్రమపై ఆశలు చిగురిస్తున్నాయి.

తాజాగా ఖైరతాబాద్ ప్రాంతంలో తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో 'విభజన హామీలు, కేంద్ర ప్రభుత్వం వివక్ష' అనే అంశంపై రాష్ట్ర సదస్సు నిర్వహించడం, అందులో ఖాజీపేట కోచ్ ఫ్యాక్టరీతో పాటు బయ్యారం ఉక్కు పరిశ్రమ అంశాలు చేర్చడం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. స్వయంగా ప్రొఫెసర్ కోదండరామ్ ఈ అంశాలపై ప్రసంగాలు చేస్తూ పాలకుల వైఫల్యాలను ఎండగడుతూ.. విభజన చట్టం హామీల అమలు ఆవశ్యకతను గుర్తు చేయడంతో కాంగ్రెస్ హయంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు దిశగా అడుగులు పడతాయన్న భావన తెలంగాణ సమాజంలో వస్తోంది. ప్రభుత్వం చేపట్టిన వందరోజుల్లో ఆరు గ్యారెంటీల అమలు కోసం కసరత్తుల్లో నిమగ్నమైన కాంగ్రెస్ ఆపై ఉక్కుపరిశ్రమ తుట్టెను కదిలిస్తుందని ఆశిస్తున్నారు. పార్లమెంట్ చివరి బడ్జెట్ సమావేశాల్లోనూ బీజేపీ ఉక్కుఊసే ఎత్తకపోవడంతో ఇక ప్రధాన ప్రతిపక్షంగా కాంగ్రెస్‌తో పాటు బీఆర్‌ఎస్‌కు ఇది రేపటి ఎన్నికల నినాద ఆయుధంగా మారుతుందనడంలో అతిశయోక్తి లేదు.

రేపు రిటైర్డ్ సీబీఐ డైరెక్టర్ ప్రసంగ కార్యక్రమం

హనుమకొండ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): హనుమకొండ లష్కర్ బజార్‌లోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ప్రైమరీస్కూల్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు 'భారత రా జ్యాంగం - సాంస్కృతిక వికాసం - పరిపాలన ధోరణులు' అనే అంశంపై రిటైర్డ్ సీబీఐ డైరెక్టర్ మన్నెం నాగేశ్వర రావు ప్రసంగం ఉంది. శ్రీ శారదాక్రిష్ణ సాహితీ సామాజిక సాంకేతిక ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమానికి ట్రస్ట్ చైర్మన్ కాసర్ల రంగారావు అధ్యక్షత వహిస్తారు. డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీఎన్ చారి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పాలకుర్తి దినకర్, కవి, రచయిత డాక్టర్ పల్లేరు వీరస్వామి, అరవింద ఆశ్రమం కార్యదర్శి వరిగొండ కాంతారావు ముఖ్య అతిధులుగా, కవి పండితులు గిరిజా మనోహర్ బాబు విశిష్ట అతిథిగా పాల్గొంటారు.

జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు రేపు

హనుమకొండ స్పోర్ట్స్, ఫిబ్రవరి2: వరంగల్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండ జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి వీరన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి జూనియర్స్ బాల బాలికల విభాగంలో ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇక్కడ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈ నెల 9నుంచి 11వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన బాల బాలికలు ఈ నెల 4న హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలోని బ్యాడ్మింటన్ కోర్టులో ఉదయం 9గంటలకు రిపోర్టు చేయాలని వీరన్న సూచించారు. మరిన్ని వివరాలకు సెల్ 9849201467 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 2: హనుమకొండ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలలో పట్టుబడిన ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ జిల్లా న్యాయమూర్తి రమేష్ శుక్రవారం తీర్పు వెల్లడించారు. హనుమకొండ ట్రాఫిక్ సీఐ జి.సీతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలోని కేయూ జంక్షన్, గొల్లపల్లి, పెద్దమ్మగడ్డ, గోపాలపురం జంక్షన్‌లలో గురువారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో 18 మందిని అదుపుతోకి తీసుకుని పరీక్షలు నిరహించగా, మద్యం సేవించినట్టు తెలిసింది. వీరిని శుక్రవారంకోర్టుకు తరలించగా ధర్మసాగర్ మండలం నారాయణగిరి గ్రామానికి చెందిన ఎమ్డీ నజీర్, రేగొండ మండలం రాయపల్లికి చెందిన లెదెల్ల శ్రావన్‌కుమార్‌లకు రెండు రోజుల జైలు శిక్ష విధించారు. మిగతా 16 మందికి జరిమానా విధించారు.

వ్యక్తి మృతికి కారణమైన ముగ్గురికి ఐదేళ్ల జైలు, జరిమానా

- మరో ఇద్దరికి రూ.4వేల జరిమానా
- తీర్పు వెలువరించిన ప్రధాన అసిస్టెంట్ జడ్జి

వరంగల్ లీగల్, ఫిబ్రవరి 2: వైవాహిక జీవితంలో జరిగిన గొడవల నేపథ్యంలో అత్తింటి వారు వేధించడం వలన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడి మృతికి కారకులైన భార్య కృష్ణవేణి, బావమరిది సురేష్, అత్త కనకతారలకు ఒక్కొక్కరికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ ప్రధాన అసిస్టెంట్ జడ్జి బ్యంగి శ్రీనివాసులు తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించకుంటే మరో ఆరునెలలు జైలు శిక్ష అనుభవించాల్సిందిగా తీర్పులో పేర్కొన్నారు. అదే విధంగా దాడికి పాల్పడిన మరో ఇద్దరు నిందితులు నాగరాజు, భార్య మేనమామ రాజశేఖర్ ఒక్కొక్కరికి రూ.4వేల చొప్పున జరిమానా విధించారు. జరిమానా చెల్లించకుంటే నాలుగు నెలలు జైలు శిక్ష అనుభవించాల్సిందిగా న్యాయ మూర్తి తీర్పులో పేర్కొన్నారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి.

దర్గాకు చెందిన బాసబత్తిని సురేష్‌కు వరంగల్ కాశిబుగ్గ నివాసురాలైన గోరంట్ల కృష్ణవేణితో 2016 ఏప్రిల్ 20న వివాహం జరిగింది. పెళ్లైన తర్వాత వీరిమధ్య గొడవలు మొదలై ఆరునెళ్ల తర్వాత పుట్టింటికి వెళ్లిపోయింది. ప్రతీసారి పంచాయితీ నిర్వహించి సురేష్‌తో క్షమాపణ చెప్పించేవారు. తరచూ ఇంట్లో నుంచి గొడవపడి వెళ్లిపోయేది. పెళ్లైన తొమ్మిది నెలల తర్వాత నిందితులు బావమరిది గోరంట్ల సురేష్, అత్త కనకతార, చాలాసార్లు సురేష్‌పై కుటుంబసభ్యులతో కలిసి దాడి చేశారు. ఈ క్రమంలో 2019 జనవరి 25న ఉదయం 7గంటలకు దర్గాలో ఒంటరిగా ఉంటున్న సురేష్‌పై బావమరిది సురేష్ మిత్రులు, అతడి కుటుంబసభ్యులు ఒక కారు, ఆటోలో ఇంటికి వెళ్లి విపరీతంగా కొట్టారు. ముక్కు, చెవుల నుంచి రక్తం వచ్చేలా తీవ్రంగా గాయపరిచారు. మళ్లీ ఆటోలో ఎక్కించుకొని కాశిబుగ్గ వరంగల్‌కు కొట్టుకుంటూ తీసుకెళ్లి వదిలేశారు. దీంతో సురేష్ అవమానాన్ని భరించలేక ఎవరికీ చెప్పులేక కుమిలిపోయాడు. అనంతరం అత్తింటివారు 2019 ఫిబ్రవరి 1న సురేష్, అతడి తల్లిపై మహిళా పోలీసుస్టేషన్‌లో వరకట్నం కేసు నమోదు చేయించారు.

ఈవిషయాలపై బాసబత్తిని సురేష్ మానసిక క్షోభకు గురై మనోవేదనతో 2019 ఫిబ్రవరి 5న సూసైడ్‌నోట్ రాసి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సూసైడ్‌నోట్‌లో తన చావుకు భార్య, ఆమె తరపు బంధువులు కారణమని పేర్కొన్నారు. కాగా, సురేష్ భార్య గోరంట్ల కృష్ణవేణి, బావమరిది గోరంట్ల సురేష్, అత్త కనకతార, సురేష్ మేనమామ కోట రాజ్‌కుమార్, అతడి స్నేహితుడు వేముల నాగరాజుపై చట్టరిత్యా చర్య తీసుకోవాలని మృతుడి అక్క బాసబత్తిని సంధ్యారాణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున ఐదుగురి నిందితులకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ ఎ. సుధాకర్ సాక్షులను ప్రవేశపెట్టగా, దర్యాప్తు అధికారులుగా ఎస్సైలు డి. దేవేందర్, సర్దార్ రాజు వ్యవహరించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎ. భద్రాద్రి కేసు వాదించారు.



గంగదేవిపల్లిని సందర్శించిన విద్యార్థులు

గీసుగొండ, ఫిబ్రవరి 2: జాతీయ ఆదర్శ గ్రామం గంగదేవిపల్లిని దేశాయిపేటలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు 200 మంది శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం, సాధించిన అవార్డులు, గ్రామాభివృద్ధి కమిటీల పనితీరును విద్యార్థులకు జిల్లా ట్రెయినింగ్ మేనేజర్ కూసం రాజమౌళి వివరించారు. అనంతరం గ్రామ శివారులో వివిధ పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కళ్యాణ్‌రాం, ఉపాధ్యాయులు జ్యోతి, సంధ్యారాణి, షమీమ్, భవాని, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న విద్యార్థులు

సమస్యలతో సహవాసం

● అధ్వానంగా శివనగర్ రైల్వేస్టేషన్ రోడ్డు ● తాగునీటికి కటకట.. ● డివిజన్‌లో పారిశుధ్య లోపం ● అసౌకర్యాలతో స్థానికుల ఆగ్రహం



శివనగర్ పల్లవి ఆస్పత్రి సమీపంలో కంకరతేలిన రోడ్డు





డ్రెయినేజీల్లో నిండిన చెత్తా చెదారం



శివనగర్‌లోని ప్రధానరోడ్డుపై ప్రమాదకరంగా మారిన విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్

ఖిలావరంగల్, ఫిబ్రవరి 2: గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ 34వ, డివిజన్ శివనగర్‌లో ప్రజలు అనేక సమస్యలతో సహవాసం చేస్తున్నారు. కంకర తేలిన రోడ్లు, అధ్వానంగా మారిన డ్రైయినేజీలు, వెలగని విద్యుత్ దీపాలతో సతమతమవుతున్నారు. శివనగర్ ప్రాంతం తాగునీటి ఎద్దడితో అల్లాడుతోంది. ఖిలావరంగల్ మాలఅగర్రల నుంచి శివనగర్ మీదుగా నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైయినేజీతో రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. విద్యుత్ దీపాలు, తాగునీరు సక్రమంగా సరఫరా అవడం లేదు. మిషన్ భగీరథ నీరు రాక స్థానికులు గగ్గోలు పెడుతున్నారు.

అధ్వానంగా రోడ్లు..

శివనగర్ అండర్‌బ్రిడ్జి పల్లవి ఆస్పత్రి రోడ్డు, వరంగల్ రైల్వేస్టేషన్ రోడ్డు, చింతల్, పుప్పాలగుట్టరోడ్డు అధ్వానంగా మారింది. రైల్వేస్టేషన్ ఎదురుగా గల వసీద్‌రోడ్డుపై ప్రైవేట్ వాహనాలు, వ్యాపార సెంటర్లు రోడ్డుపైకి చొచ్చుకుని రావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శివన గర్‌లో అండర్ డ్రైయినేజీ ఏర్పాటుతో పల్లవి ఆస్పత్రి నుంచి పాకి వారి వీధి వరకు సుమారు 20 గల్లీల్లో అంతర్గత రోడ్లు 2 ఫీట్లలో తు వరకు గుంతలు పడ్డాయి. అధికారులు అందులో కంకర పోసి వదిలేయడంతో ద్విచక్రవాహనదారులు శివనగర్ నుంచి వాహనాల్లో వరంగల్‌కు వచ్చేక్రమంలో, రాత్రి వేళల్లో ప్రమాదాల బారిన పడుతున్నారు. అలాగే శివనగర్‌లోని పలు కూడళ్ల వద్ద సమీపంలోని ప్రజలు ఇళ్లల్లోని చెత్తను ప్రధాన రోడ్లపై పడవేయడంతో చెత్త చేరి దుర్గంధం వ్యాపిస్తోంది. ఖిలావరంగల్, శివనగర్, పుప్పాల గుట్ట, చింతల్‌ల లో అండర్ డ్రైయినేజీ పనుల కారణంగా భారీ వాహనాల రాకపోకలతో దుమ్ము దూళితో పాటు, శివనగర్ రైల్వేస్టేషన్ రోడ్డు కంకరతెలి గుంతలమయంగా మారింది. శివనగర్ ప్రధాన సెంటర్‌ల వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల చుట్టూ సరైన ఫెన్సింగ్ ఏర్పాటు చేయలేదు. అందులో ముళ్ళపొదలు పెరిగి ప్రమాదకరంగా మారాయి.

చెత్తాచెదారంతో దుర్వాసన : మురళీధర్‌స్వామి, శివనగర్



శివనగర్‌లోని నాలుగు కూడళ్ళు, ప్రధాన సెంటర్లు వద్ద స్థానికులు వేస్తున్న చెత్తాచెదారంతో దుర్గంధం వ్యాపిస్తోంది. నగర పాలక సంస్థ సిబ్బంది నిత్యం చెత్తను తొలగించాలి. శివనగర్‌లోని నాలుగు కూడళ్ళు ప్రధానసెంటర్‌ల వద్ద సెంట్రల్, ఐమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయాలి. సమస్య పరిష్కరించాలి.

భారీ వాహనాలతో రోడ్లు ధ్వంసం : కుమార్, శివనగర్



ఖిలావరంగల్, శివనగర్, చింతల్, పుప్పాలగుట్ట తదితర ప్రాంతాలలో జరుగుతున్న అండర్‌డ్రైయినేజీ పనుల కారణంగా శివనగర్ రైల్వేస్టేషన్ రోడ్డు గుంతలమయంగా మారింది. భారీ వాహనాల రాకతో రోడ్లన్నీ అధ్వానంగా మారాయి. దుమ్ముదూళీ ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి.

రైలు నుంచి పడి గుర్తు తెలియని ప్రయాణికుడి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

గిర్మాజిపేట, ఫిబ్రవరి 2 : వరంగల్ రైల్వేగే టు సమీపంలోని చిన్న బ్రిడ్జిపై గురువారం రాత్రి వరంగల్ నుంచి న్యూఢిల్లీ వెళ్తున్న రైలు నుంచి ప్రమాద వశాత్తు పట్టాలపై పడి గుర్తు తెలియని ప్రయాణికుడు (28) మృతి చెందినట్లు వరంగల్ జీఆర్‌పీ సీఐ జి.నరేష్ శుక్రవారం తెలిపారు. మృతుడు 5 అడుగుల 6 అంగుళాల ఎత్తు, ఎరుపు రంగు శరీరం, నల్లని తల వెంట్రుకలు, నలుపు రంగు గడ్డం, పొట్టపై పుట్టుమచ్చ కలిగి పోలో కంపెనీ బ్లూకలర్ జీన్స్ ప్యాంటు, రెడ్ కలర్ ఫుల్ టీషర్టు, బ్లాక్ కలర్ ఫుల్ డ్రాయర్ ధరించి ఉన్నాడని తెలిపారు. రైలు లోంచి ప్రమాదవశాత్తు జారి పడి మృతిచెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచినట్లు చెప్పారు. మృతుడి గుర్తింపు కోసం వరంగల్- న్యూఢిల్లీ, వరంగల్-హైదరాబాద్ మార్గాల్లోని రైల్వే పోలీసుసే ్టషన్‌లకు సమాచారం పంపించి, ఎస్సై ఎం.అయిలయ్య కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

గీసుగొండ, ఫిబ్రవరి 2: టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు ఎంఈవో సత్యనారాయణ సూచించారు. టెన్త్ విద్యార్థులకు ఓరియెంటేషన్ తరగతులను జెడ్పీ పాఠశాల గీసుగొండలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎన్‌వో రవిందర్, కాంప్లెక్స్ హెచ్‌ఎం పట్టాభి, విషయ నిపుణులు విట్టోభ, సలీంపాష, రవిచందర్, నజరుద్దిన్, విశ్వేశ్వర్‌రావు, సురేఖ, రవిచందర్ తదితరులు పాల్గొన్నారు.

మరియపురం సర్పంచ్‌కు సన్మానం



బాలిరెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్థులు

గీసుగొండ, ఫిబ్రవరి 2: 'నిస్వార్థ సేవతోనే జాతీయ స్థాయిలో మరి యపు రంను ఉత్తమ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దిన మిమ్మల్నే ఏకగ్రీవంగా ఎన్నుకు ంటాం' అని గ్రామస్థులు అన్నారు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో మరియపురం సర్పంచ్ బాలిరెడ్డితోపాటు వార్డు సభ్యులను గ్రామస్థులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. బాలిరెడ్డి మాట్లాడుతూ ఉన్నదానిలో కొంత ప్రజాసేవకు ఖర్చు చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. గ్రామస్థుల సహకారం తోనే మరియపురం జాతీయ ఉత్తమ గ్రామంగా ఎదిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వీరారావు, స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి, కార్యదర్శి స్వప్న, ప్రముఖ కవి జీడికంటి శ్రీనివాసమూర్తి, దిలీప్, అడ్డాల బీమారావు తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తి పీఎస్‌ను తనిఖీ చేసిన సీపీ



రాయపర్తి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

రాయపర్తి, ఫిబ్రవరి 2 : రాయపర్తి పోలీస్ స్టేషన్‌ను గురువారం రాత్రి వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించి, సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల పోలీసులు గౌరవంగా ఉండాలని సూచించారు. వచ్చిన ఫిర్యాదులకు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

ప్రభుత్వ సలహాదారుడు రవిని కలిసిన ఎర్రబెల్లి స్వర్ణ దంపతులు



వర్ధన్నపేట, ఫిబ్రవరి 2 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు రవిని శుక్ర వారం హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ వరద రాజేశ్వర్‌రావు మర్యా దపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో ఘనంగా సన్మానించారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై సమరశీల పోరు సాగించాలి

● సీఐటీయూ జాతీయ అధ్యక్షురాలు హేమలత ● రెండో రోజుకు చేరిన సీఐటీయూ జాతీయ సమావేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జాతీయ అధ్యక్షురాలు హేమలత

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 2: దేశంలో బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని, ప్రజలు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ హేమలత పిలుపునిచ్చారు. హనుమకొండ జిల్లా కాజీపేట పాతిమానగర్‌లోని బాలవికాసలో జరుగుతున్న సీఐటీయూ జాతీయ సమావేశాలు శుక్రవారంతో రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ కార్యక్రమానికి హాజరైన హేమలత ముందుగా సీఐటీయూ పతాకాన్ని ఆవిష్కరించారు. సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ కార్యక్రమాన్ని ప్రారంభించగా హేమలత ముఖ్య వక్తగా హాజరై ప్రసంగించారు. ప్రపంచంతో ఆర్థిక సంక్షోభం పెరిగిపోతోందని, దీని ప్రభావం భారత్‌పై కూడా తీవ్ర ప్రభావం చూపుతోందని అన్నారు. పేద, ధనిక తారతమ్యాలు అధికమవుతున్నాయని గుర్తు చేశారు. ఈ దుష్ప్రభావం వల్ల నిరుద్యోగ దారిద్ర్యం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు ధరలకు అనుకూలంగా పెరగక పోవడం వల్ల కొనుగోలు శక్తి క్షీణిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ కంపెనీలకు గణనీయమైన లాభాలు, కార్మికుల వేతనాలు క్షీణించడం ఒక ధోరణిగా ప్రభవించిందని అన్నారు. వ్యవసాయరంగం, వ్యవసాయ దిగుబడి పదేళ్లుగా సవాళ్లను ఎదుర్కొంటోందని అన్నారు. ఈ నెల 16న జరిగే గ్రామీణ భారత్‌బంద్‌లో ప్రజలు, కార్మికులు, కర్షకులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. రామాలయ నిర్మాణం భావోద్వేగాల మధ్య ప్రారంభించి.. 2024లో పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ రాజకీయం చేసే ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. బీజేపీ ప్రభుత్వం బహుళజాతి ప్రయోజనాల కోసం పని చేస్తోందని, 130కోట్ల ప్రజల జీవితాలను పణంగా పెట్టి డ్రామాలు చేస్తోందని మండిపడ్డారు. కాగా, జాతీయ వర్కింగ్ కమిటీ సమావేశాలు హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్నాయని రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్ స్వాగతోపన్యాసంలో వెల్లడించారు. పోరాటాల గడ్డ, చారిత్రక నగరం అయిన ఓరుగల్లు గడ్డపై జాతీయ సమావేశాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. సీఐటీయూ బలోపేతం కోసం అన్ని వర్గాలను కలుపుకుని పనిచేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్, జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య, ఆఫీస్ బేరర్స్ ప్రభాకర్‌రెడ్డి, మెట్టు రవి, బొట్ల చక్రపాణి, సారంగపాణి, సంపత్, రజిత పాల్గొన్నారు.

తహసీల్దార్ల డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 2: ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేయడంలో అధికారుల పాత్రే కీలకమని కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి అన్నివేళలా తాము సిద్ధమన్నారు. శుక్రవారం వరంగల్ జిల్లాకు చెందిన తహసీల్దార్ల అసోసియేషన్‌కు చెందిన 2024 సంవత్సరం డైరీ, క్యాలెండర్‌ను తన చాంబర్‌లో కలెక్టర్ ఆవిష్కరించారు. అసోసియేషన్ రాష్ట్ర సహ అధ్యక్షులు బండి నాగేశ్వర్‌రావు, ఉపాధ్యక్షులు మహ్మద్ ఎక్బాల్ అహ్మద్, ఫణికు మార్, రాజేష్‌గౌడ్, రమేష్, కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్, సర్వేశ్వర్, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అగ్నిమాపక కేంద్రాన్ని సందర్శించిన విద్యార్థులు



విద్యార్థులతో సిబ్బంది

మట్టెవాడ, ఫిబ్రవరి 2: మట్టెవాడ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు శుక్రవారం మట్టెవాడలోని అగ్నిమాపక కేంద్రాన్ని సందర్శించారు. షార్ట్ సర్క్యూట్‌తో వచ్చే మంటలను, చమురుతో వచ్చే మంటలను ఆర్పే విధానాన్ని ప్రదర్శనలతో సిబ్బంది వారికి వివరించారు. మంటలను ఆర్పేటప్పుడు నీటిని ఎలా వినియోగించాలని, సీవో2 కార్బన్ ఆక్సైడ్‌ను ఎలా ఉపయోగించాలనే విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఎ.శ్రీనివాస్, ఉపాధ్యాయులు డి.కిరణ్, సురేశ్, శివకుమార్, శ్రీధర్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు



పార్టీలో చేరినవారికి కండువాలను కప్పి ఆహ్వానిస్తున్న రవికుమార్

గీసుగొండ, ఫిబ్రవరి 2: తెలంగాణ విద్యార్థి ఉద్యమ నాయకుడు ఎర్రగొల్ల భరత్‌వీర్‌తోపాటు వందమంది యువకులు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. శుక్రవారం ధర్మారంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో రవికుమార్ పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ చేపడుతున్న ప్రజాసంక్షేమ పథకాలు, సాహ సోపేతమైన నిర్ణయాలతో యువత బీజేపీకి ఆకర్షితులవుతున్నట్లు చెప్పారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రంలో 10ఎంపీ సీట్లు సాధించటమే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ వన్నాల వెంకటరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి హరిశంకర్, జిల్లా ఉపాధ్యక్షుడు రాదారపు శివకుమార్, కోశాధికారి పగడాల రాజ్‌కుమార్, రంజిత్, కంది క్రాంతికుమార్, కందిమల్ల మహేష్, అరుణ్‌సాయి, శ్రీనివాస్, నవీణ్, అజయ్ పాల్గొన్నారు.

నేడు 'కుడా'లో మంత్రి సురేఖ సమీక్ష

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 2: హనుమకొండలోని కుడా కార్యాలయంలో శనివారం సమీక్ష జరుగనుంది. మంత్రి కొండా సురేఖతో పాటు ఎమ్మెల్యేలు పాల్గొననున్నారు. ఉదయం 11 గంటలకు సమీక్ష ఆరంభంకానుంది. జీడబ్ల్యూఎంసీ, కుడాతో పాటు లైన్ డిపార్ట్‌మెంట్ల అభివృద్ధిపనులపై మంత్రి సురేఖ సమీక్షించనున్నట్లు తెలిసింది. మంత్రిగా బాధ్యతలు చేపట్టాక తొలిసారిగా కొండా సురేఖ 'కుడా' కార్యాలయంలో సమీక్ష నిర్వహిస్తున్నారు.

ఆర్టీవోను కలిసిన వడుప్సా ప్రతినిధులు



ఆర్టీవోను సన్మానిస్తున్న వడుప్సా ప్రతినిధులు

సంగెం, ఫిబ్రవరి 2: వరంగల్ ఆర్టీవోగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన పి.రంగారావును శుక్రవారం వడుప్సా జిల్లా ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆడెపు శ్యామ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బిల్లా రవి, సలహాదారులు కోడెం శ్రీధర్, ప్రైవేటు విద్యాసంస్థల బస్సు ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గాదె స్వరూప్‌రెడ్డి, ఖిలావరంగల్ జోన్ అధ్యక్షుడు ముక్కెర రవీందర్, ప్రధానకార్యదర్శి దాసి సతీష్‌మూర్తి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

ఖిలావరంగల్, ఫిబ్రవరి 2: రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఖిలావరంగల్‌లోని బాలికల ఉన్నత పాఠశాల ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు కత్రాజు వెంకటయ్య తెలిపారు. శుక్రవారం మధ్యకోటలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఇటీవల ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమకొండ జిల్లాలోని ప్రాక్టిసింగ్ హైస్కూల్‌లో జరిగిన జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఇద్దరు విద్యార్థులు రజిత, శ్రీహర్షితలు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 3, 4 తేదీల్లో మెదక్ జిల్లాలోని తూప్రాన్ సెయింట్ ఆర్నాల్డ్ హైస్కూల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొన నున్నట్లు వెల్లడించారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రత్యేకాధికారిగా తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



స్పెషల్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న తహసీల్దార్

సంగెం, ఫిబ్రవరి 2: మండలంలోని 33 గ్రామాల్లో సర్పంచుల పదవీకాలం పూర్తికావడంతో ఆయా గ్రామాలకు కేటాయించిన స్పెషల్ ఆఫీసర్లు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయా గ్రామపంచాయతీ కార్యాలయాలకు స్పెషల్ ఆఫీసర్లుగా ఎంపికైన అధికా రులు బాధ్యతలు స్వీకరించారు. ఎంపీపీ కందగట్ల కళావతినరహరి పాల్గొన్నారు.

'లిడ్‌క్యాప్ బోర్డును ఏర్పాటు చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

వ రంగల్ టౌన్, ఫిబ్రవరి 2: రాష్ట్రంలో లిడ్‌క్యాప్ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని తెలంగాణ మాదిగ చర్మకారుల లెదర్ పరిశ్రమల భూముల పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు కూసపాటి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని కాశిబుగ్గలో కమిటీ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథి శ్రీనివాస్ మాట్లాడుతూ 2014లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విడిపోయినప్పటి నుంచి ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్రంలో లిడ్‌క్యాప్ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయకపోవడంతో బాధాకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, దామోదర రాజనర్సింహ కేంద్ర మంత్రిని కలిసి రాష్ట్రంలో మెగా, మినీ లేదర్ పరిశ్రమలను మంజూరు చేయాలని కోరడం అభినందనీయమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 80వేల మంది చెప్పు డప్పు వృత్తిదారులకు రూ.3వేల పెన్షన్ ఇస్తోందని, రాష్ట్రంలో ఉన్న మాదిగలకు లిడ్‌క్యాప్ బోర్డును ఏర్పాటు చేసి రూ. 4వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇమాన్యుల్, ఇటికాల లత, గాదె కుమారస్వామి, స్వామి, శంకర్, రమణ, వడ్డెమాని నాగరాజు, శ్యామ్, ధనలక్ష్మి, అరవింద్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా : మాజీ ఎమ్మెల్యే



శివనగర్ రామాలయంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

ఖిలావరంగల్, ఫిబ్రవరి 2: కార్యకర్తలకు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. శుక్రవారం ఖిలావరంగల్ తూర్పుకోట, శివనగర్ రామాలయంలో బీఆర్ఎస్ ముఖ్యనాయకులు, కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లో ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయకుంటే వదిలిపెట్టేది లేదన్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ, వారికి అండగా ఉంటానన్నారు. ఇటీవల మృతి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త బిళ్ళ సంపత్‌కు ప్రమాదబీమా పథకం ద్వారా రూ. 2లక్షల ప్రొసీడింగ్ పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో 37వ, డివిజన్ కార్పొరేటర్ వెల్పుగొండ సువర్ణ-సురేష్, 34వ, డివిజన్ కార్పొరేటర్ దిడ్డికుమారస్వామి, మాజీ కార్పొరేటర్ బిళ్ళ కవిత-శ్రీకాంత్, 34, 37 డివిజన్ అధ్యక్షులు పగడాల సతీష్, సంగరబోయిన విజయ్, బిళ్ళ రవి పాల్గొన్నారు.



వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

ఖానాపురం, ఫిబ్రవరి 2: మండలంలోని ధర్మరావుపేట స్వయంభూ శ్రీదేవి భూదేవి సమేత పగడాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణో త్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్య క్రమంలో ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామినాయక్, ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, జడ్పీటీసీ బత్తిని స్వప్నశ్రీనివాస్‌గౌడ్, ఆలయ నిర్మాణ కర్త మాద్రాజు వెంకన్న, అర్చకుడు అన్వేష్, లింగబత్తుల యాకసాయన్న, బుర్ర వేణుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గద్దెదించాలి

• సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు కుమారస్వామి


మాట్లాడుతున్న కొరబోయిన కుమారస్వామి

నర్సంపేట, ఫిబ్రవరి 2 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని గద్దె దించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు కొరబోయిన కుమారస్వామి పిలుపు నిచ్చారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం ఆంజనేయు లు అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఆర్థిక మంత్రి పార్లమెంటులో ప్రవేశ పెట్టిన బడ్జెట్ అంకెల గారడీ తప్ప సామాన్యులకు అనుకూలమైన బడ్జెట్ కాదని అన్నారు. దేశానికి అన్నం పెట్టే అన్నదాతలకు ఇచ్చే ఎరువుల సబ్సిడీలో కోత విధించా రని అన్నారు. ఉపాధిహామీ నిధుల్లో కూడా కోత విధించారని పేర్కొన్నారు. ప్రజావ్యతి రేక, రైతు వ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శ్రీనివాసరెడ్డి, అన్వర్, కత్తికట్టయ్య, పెండ్యాల సారయ్య, కమతం వెంకటేశ్వర్లు, రాజులపాటి సూరయ్య, భసిక మొగిలి, రుద్రారపు లక్ష్మి పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు అనుకూలం

• ఎంసీపీఐ(యూ) జిల్లా నాయకుడు రాజమౌళి


సమావేశంలో మాట్లాడుతున్న రాజమౌళి

నర్సంపేటటౌన్, ఫిబ్రవరి 2 : కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ కార్పొరేట్ శక్తుల కు అనుకూలంగా ఉందని ఎంసీపీఐ(యూ) జిల్లా నాయకుడు కొత్తకొండ రాజమౌళి అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయం ఆవరణలో శుక్ర వారం జరిగిన సమావేశంలో ఆయ న మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ నిరుద్యోగులకు తీవ్ర నిరాశ కలిగించిందని, విద్యా సంస్థల్లో పోస్టుల భర్తీ అంశాలన్ని ప్రస్తావించలేద న్నారు. ఆంగ్ల మాధ్యమం పేరుతో రూ.35వేల కోట్ల బడ్జెట్‌ను తగ్గించడంతో ప్రభుత్వ ఆర్థిక డొల్లతనం బయటపడిందన్నారు. రైతు బంధు కొనసాగిస్తామని చెప్పినప్పటికీ ఇప్పటివరకు తొలి విడత డబ్బులు రైతులకు అందలేదన్నారు. బడ్జెట్ పేద, మధ్య తరగతి ప్రజలకు నష్టం తప్ప ఏ మాత్రం లాభం చేకూరేలా లేదన్నారు. ఈ సమావేశంలో ఎంసీపీఐ(యూ) నాయకులు రమేష్, మాషూక్, ప్రకాశ్ పాల్గొన్నారు.

వైపీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కుమారస్వామి



నెక్కొండ, ఫిబ్రవరి 2: యాదవ పోరాట సమితి (వైపీఎస్) వరంగల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మండలంలోని అప్పల్ రావుపేటకు చెందిన కన్నెబోయిన కుమారస్వామిని నియమించినట్లు యాదవ సంఘం జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్ శుక్రవారం తెలిపారు. కుమారస్వామి యాదవ సంఘానికి తన వంతు సేవలు చేస్తున్న కృషిని గుర్తించిన రాష్ట్ర నాయకత్వం సూచనల మేరకు జిల్లా పదవికి నియమించామన్నారు.

మార్కండేయ కాలనీ అభివృద్ధికి కృషి


సొసైటీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న పద్మశాలి సంఘం బాధ్యులు సర్వేశం, రామానంద్

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 2 : నర్సంపేట పట్టణంలోని మార్కండేయకాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని పద్మశాలి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పెండెం రామానంద్ అన్నారు. కాలనీలోని డెవలప్‌మెంట్ సొసైటీ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. మార్కండేయ కాలనీకి విశిష్ట చరిత్ర ఉందని, ఎంతో మంది పోరాటాల ఫలితంగా కాలనీ అభివృద్ధి చెందిందన్నారు. రానున్న రోజుల్లో కాలనీ అభివృద్ధికి ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారం ఉంటుందన్నారు. ప్రభుత్వ నిధులతో కాలనీపై దృష్టి సారించి అభివృద్ధికి పెద్దపీట వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కండేయ కాలనీ డెవలప్‌మెంట్ సొసైటీ గౌరవ అధ్యక్షుడు బాల్నే సర్వేశం, అధ్యక్షుడు పెండెం శివానంద్, కార్యదర్శి బాల్నే సుభాష్, మాణిక్యరావు, కొమ్మాలు, శ్రీధర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

• లక్నేపల్లి పాఠశాలను సందర్శించిన కలెక్టర్ ప్రావీణ్య

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 2 : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలవాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. నర్సంపేట మండలం లక్నేపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ శుక్రవారం సందర్శించి ఓరియంటేషన్-2024 కార్యక్రమాన్ని బోధిస్తున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జీవితంలో 10వ తరగతి తొలి మెట్టులాంటిదని, విద్యార్థులు ఇష్టపడి చదివి పరీక్షల్లో మంచి ర్యాంకు సాధించాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణతతో పాటు ఉత్తమ గ్రేడ్ సాధించేలా బోధించాలన్నారు.. విద్యార్థులు రాతపరమైన అంశాలను జాగ్రత్తగా ప్రజెంట్ చేసే విధంగా తగినంత సమయంలో జవాబు రాసే విధానాన్ని పాటించాలన్నారు. విద్యార్థులు అత్యధిక జీపీఏ 10/10 సాధించే మెలకువలు తెలుసుకోవాలన్నారు. రాబోయే పబ్లిక్ పరీక్షల్లో భయం, ఆందోళన లేకుండా ధైర్యంతో పరీక్షలు రాయాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈవో వాసంతి, ఎంఈవో రత్నమాల, హెచ్ఎం మాధురి, రిసోర్స్‌పర్సన్స్‌లు పాల్గొన్నారు.


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

పాఠశాల పరిసరాల్లో దుకాణాలను ఎత్తివేసేలా చర్యలు తీసుకోవాలి

కలెక్టర్‌కు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడి వినతి

ప్రభుత్వ పాఠశాల పరిసరాల్లో అనుమతులు లేకుండా వెలిసిన దుకాణాల వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారి దుర్గంధం వెదజల్లడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, సంబంధిత దుకాణాలను ఎత్తివేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం పాఠశాల సందర్శనకు వచ్చిన కలెక్టర్ ప్రావీణ్యకు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ రఫీసాబ్ వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల పరిసరాల్లో మద్యం దుకాణాలు, చికెన్ సెంటర్‌లు నిర్వహిస్తూ వ్యర్థాలు, మూత్రవిసర్జనతో దుర్గంధం, దోమలు స్వైర విహారం చేస్తున్నాయన్నారు. దీంతో విద్యార్థులు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో భార్య మృతి

• భర్తకు గాయాలు


మేరమ్మ (ఫైల్)

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 2 : రోడ్డు ప్రమాదంలో భార్య మృతి చెందగా, భర్తకు గాయాలైనసంఘటన నర్సంపేట పట్టణంలోని నెక్కొండ రోడ్డులో శుక్రవారం సాయంత్రం జరిగింది. మృతురాలి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం వివరాలిలావున్నాయి. చెన్నారావుపేట మండలం తిమ్మరాయిని పహడ్ గ్రామానికి చెందిన పసునూరి చిన్నబాబు తన టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై భార్య మేరమ్మ(40)తో కలిసి నర్సంపేటలో బియ్యం కొనుగోలు చేయడానికి శుక్రవారం సా యంత్రం వస్తున్నాడు. ఈ క్రమంలో నర్సంపేట పట్టణంలోని నెక్కొండరోడ్‌లోని భద్రకాళి వొకేషనల్ కళాశాల సమీపంలోకి రాగానే జయముఖి ఇంజనీరింగ్ కళాశాల నుంచి నర్సం పేట వైపు వస్తున్న బైక్ వెనుకాల నుంచి చిన్నబాబు వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో కిందపడిపోయిన మేరమ్మ అక్కడికక్కడే మృతిచెందగా, చిన్నబాబు పక్కటె ముకలు విరిగాయి. వెంటనే చిన్నబాబును పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్సలందించారు. మృతురాలికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. మేరమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం గదికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవి తెలిపారు.

వరిలో కాండం తొలిచే పురుగుపై దృష్టి సారించాలి


వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త దామోదర్ రాజు

వర్ధన్నపేట రూరల్, ఫిబ్రవరి 2 : వరిలో కాండం తొలిచే పురుగుపై రైతులు దృష్టి సారించి యాజమాన్య పద్ధ తులను పాటించాలని వరి పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ సిహెచ్.దామో దర్‌రాజు సూచించారు. శుక్రవారం మండలంలోని నల్లబెల్లిలో క్షేత్రస్థాయిలో వరి పంటను పరిశీలించి, మాట్లాడారు. యాసంగిలో కూడా నారుమడి, పిలక దశల్లో కాండం తొలిచే పురుగు రెక్కల ఉధృతిని గమనించినట్లు తెలిపారు. పురుగు ఉధృతిని గమనించడానికి దీనపు ఎరను, సోలార్ దీనపు ఎర లేదా లింగాకర్షక బుట్టలను అమర్చుకోవాలన్నారు. పిలక దశలో ఎకరాకు 3 లింగార్షక బుట్టలు పెట్టి అందులో వారానికి బుట్టకు 25-30 పురుగులు పడినప్పుడు తప్పనిసరిగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. నారు మడిలో కార్బోఫ్యూరాన్ 3 సీజీ గుళికలు లేదా 600గ్రా. ఫిప్రోనిల్ 0.3 జీ గుళికలు వేయాలన్నారు. ఒకవేళ నారుమడిలో వేయకపోతే 15రోజులు వయసున్న పిలక దశల్లో ఉన్న వరి పైరులో తప్పకుండా కార్బోఫ్యూరాన్ 3సీజీ గుళికలు 10 కిలోలు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4 జీ గుళికలు 8 కిలోలు లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.4గుళికలు 4కిలోలు 20-25 కిలోల ఇసుకలో కలిపి బురద పదునులో వేయాలన్నారు. అలాగే మొగిపురుగు నివారణ సిఫారసు చేయబడని ఇతర 10జీ లేదా సేంద్రీయ గుళికలను యూరియాతో కలిపి వేయడం వలన ఎలాంటి ప్రయోజనం ఉండదని రైతులను సూచించారు.

బాధ్యతలు చేపట్టిన ప్రత్యేక అధికారులు

దుగ్గొండి, ఫిబ్రవరి 2: మండలంలోని 34 గ్రామ పంచాయతీలకు సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో శుక్రవారం ప్రత్యేక అధికారులుగా పదవీ బా. ధ్యతలు స్వీకరించారు. అడవిరంగాపురం, మదిరమందపల్లి, రాజ్యతండా జీపీలకు డీటీ కిరణ్‌కుమార్, బం దంపల్లి, కేశవపురం, లక్ష్మీపురంలకు ఎస్సారెస్పీ ఏఈ సతీష్, నారాయణతండా, తిమ్మంపేట, చలపర్తిలకు ఏవో దయాకర్, దేశాయిపల్లి, దుగ్గొండి, గుడి మహేశ్వరానికి తహసీల్దార్ రవిచంద్రారెడ్డి, మహ్మదాపురం, మర్రిపల్లి, బొబ్బరోనిపల్లిలకు ఎస్సారెస్పీ డీఈ రామ కృష్ణ, మల్లంపల్లి, చంద్రయ్యపల్లి, గోపాలపురానికి వెటర్నరీ డాక్టర్ రాంమోహన్, మందపల్లి, పీజీ తండా, చాపలబండలకు పీఆర్ ఏఈ వెంకటేశ్వర్లు, ముద్దునూరు, గుండెల్లులపల్లి, మైసంపల్లిలకు వెటర్నరీ డాక్టర్ బాలాజీ, నాచినపల్లి, పొనకల్, బిక్కాజిపల్లి గ్రామాలకు ఎంపీవో శ్రీధర్‌గౌడ్, శివాజీనగర్, రేకంపల్లి, వెంకటాపురం ఎంపీడీవో కృష్ణప్రసాద్, రెబల్లే, గిర్నిబావి, తొగర్రాయిలకు వెటర్నరి డాక్టర్ శారదలు పదవీ బాధ్యతలు స్వీకరించారు.

●వర్ధన్నపేట రూరల్ : మండలంలోని 18 గ్రామాలకు గాను నియమించిన ప్రత్యేక అధికారులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. మండలంలోని రామవరం, దమ్మన్నపేట గ్రామాల్లో ఎంపీవో ధనలక్ష్మి బాధ్యతలు చేపట్టగా, స్థానిక కార్యదర్శులు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామపంచా యతీల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి సేవలందించాలని సిబ్బంది సూచించారు. పచ్చదనం, పరిశుభ్రత పట్ల రాజీ పడకుండా పనిచేయాలని తెలిపారు.

● ఖానాపురం: మండల వ్యాప్తంగా ఉన్న 20 జీపీల్లో ప్రత్యేక అధికారులు బాధ్యతలు స్వీకరించారు. కొత్తూరు, రంగాపురం ప్రత్యేక అధికారిగా ఎంపీడీవో సుమనవాణి బాధ్యతలు స్వీకరించారు. ఖానాపురం, రంగాపురంలో ప్రత్యేక అధికారిగా తహసీల్దార్ కిరణ్ కుమార్, అశోక్‌నగర్, అయోధ్యనగర్ ప్రత్యేక అధికారిగా ఎంఏఈవో బోగ శ్రీనివాస్, వేపచెట్టుతండా, నాజీతండా ప్రత్యేక అధికారిగా ఐబీ ఏఈ రమేష్ బాబు, బుధరావుపేట, చిలుకమ్మనగర్‌లో ఎంపీవో రవి, చిలుకమ్మతండా, కీర్యాతండా, దబీర్‌పేటలో ఐబీ ఏఈ స్నేహిత, ధర్మరావుపేట, భద్రుతండాలో ఐబీ ఏఈ స్వాతి, మనుబోతులగడ్డ, బండమీది మామిడి తండాలో ఐబీ ఏఈ అనిత, కొడ్తిమాట్‌తండా, మంగళవారిపేట, బోటిమీదితండాలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మౌనికలు ప్రత్యేక అధికారులుగా బాధ్యతలు స్వీకరించారు.

వీర్‌గాథా కీర్తి ప్రసన్నకు ఘన సన్మానం


విద్యార్థిని సన్మానిస్తున్న డీఈవో వాసంతి, ఉపాధ్యాయులు

చెన్నారావుపేట., ఫిబ్రవరి 2: మండలంలోని ఉప్పరపల్లి గ్రామ హై స్కూల్‌లో వీర్‌గాథా సూపర్ 100 విజేత కీర్తి ప్రసన్నకు శుక్రవారం పాఠశాలలో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి వాసంతి మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో ఉన్న ఉప్పరపల్లి పాఠశాలను ఢిల్లీ వరకు తీసుకెళ్లిందన్నారు. కీర్తి ప్రసన్నను ఆదర్శంగా తీసుకొని ఎదగాలన్నారు. బాలిక విద్యా బలోపేతానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వీర్‌గాథా 3.0 కార్యక్రమంలో విద్యార్థి నిలవటం జిల్లాకే గర్వ కారణమన్నారు. విద్యార్థులు చదువులతో పాటు వివిధ రంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కట్ల శ్రీనువాస్, హెచ్ఎం జయ, జీసీడీఓ ఫ్లోరెన్స్, ఎంఈవో రత్నమాల, గైడ్ టీచర్ మాధవి, వాడపల్లి సుధీర్‌బాబు, మండ నోడల్ అధికారి సరళ, సలీం, రవీందర్, ప్రభాకర్‌రావు, పిన్నింటి బాలాజీరావు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

50 ఏళ్లు పూర్తి చేసుకున్న భారతీయ నాటక కళా సమితి

వర్ధన్నపేట, ఫిబ్రవరి 2 : భారతీయ నాటక కళా సమితి 50 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న వేళ కవులు, కళాకారులకు, రచయితలు, ప్రముఖుల అభిప్రాయాలతో ప్రత్యేక సంచికను ప్రచురించబోతున్నట్లు భారతీయ నాటక కళాసమితి వ్యవస్థాపక సభ్యుడు పోశాల సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. కళలకు కాణాచిగా ప్రసిద్ధి గాంచిన ఓరుగల్లు జిల్లా మరీ ముఖ్యంగా నాటక రంగానికి నిలువెత్తు స్తంభంలా నిలిస్తోంది. ఓరుగల్లులోని వర్ధన్నపేట పట్టణంలో 1974లో ఏర్పాటైన భారతీయ నాటక కళా సమితి నేటికి 50 సంవత్సరాలు పూర్తి చేసుకొని స్వర్ణోత్సవ సంబరాలకు సిద్ధమైంది, మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 14వ తేదీలోపు అభిప్రాయాలను 9963802154కు వాట్సాప్ చేయాలని ఆయన కోరారు. మార్చి 3 నుంచి 8వ తేదీ వరకు జరిగే స్వర్ణోత్సవాలకు కళాభిమానులందరూ హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నులి పురుగుల నివారణ మాత్రలు వేయించాలి

నెక్కొండ, ఫిబ్రవరి 2 : చిన్నారుల ఎదుగుదలకు ప్రతిబంధకాలైన నులి పురుగుల నివారణకు చర్యలు తీసుకోవాలని మండలంలోని అలంకానిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి డాక్టర్ అరుణ్ కుమార్ సూచించారు. ఈ నెల 12 వ తేదిన జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సు కల్గిన ప్రతీ ఒక్కరికి నులిపురుగుల నివారణ మాత్రలను తప్పకుండా వేయించాలని సూచించారు. ఈ సమావేశంలో డాక్టర్ సుధా, వైద్య సిబ్బంది రాజు, సునీత, ప్రవళిక, వినోద, పద్మ, సుజాత, ప్రభ , కరుణ , ఉపాధ్యాయులు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవు

• వర్ధన్నపేట మునిసిపల్ కమిషనర్ జోనా

వర్ధన్నపేట, ఫిబ్రవరి 2 : ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని, రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేస్తున్నందున సంబంధిత యాజమాన్యానికి నోటీసులు ఇవ్వడం జరిగిందని వర్ధన్నపేట మునిసిపల్ కమిషనర్ జోనా తెలిపారు. వర్ధన్నపేట బస్టాండ్ సమీపంలోని భారతీయ స్టేట్‌బ్యాంక్ శాఖ ఎదుట జాతీయ రహదారిపై వాహనాలు నిలుపడం వల్ల వాహనదారులు, బ్యాంకుకు వచ్చిపోయే వారు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా సంబంధిత భవన యాజమాన్యానికి నోటీసులు జారీచేశామని తెలిపారు. భవనం సెల్లార్‌లో పార్కింగ్‌కు అవకాశం ఉన్నప్పటికీ సెల్లార్‌లో కమర్షియల్ షాపులు ఏర్పా టుచేసి వాహనాలు రోడ్డుపైనిలిచేవిధంగా చేయడంసరికాదన్నారు.ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోకతప్పదన్నారు. గతంలో ముఖాముఖి హెచ్చరించినా యాజమాన్యం పట్టించుకోకపోవడంతోనే నోటీసులు జారీచేసినట్లు వివరించారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి


ప్రిన్సిపాల్ సెక్రటరీకి వినతి పత్రం అందిస్తున్న నాయకులు

చెన్నారావుపేట, ఫిబ్రవరి 2: ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర్ర వెంకటేశంను సాధార ణ పరిపాలన అధికారులు కలిసి శుక్రవారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్థానికత ఆధారంగా జీవో 317ద్వారా బాధితులకు న్యాయం చేయాలన్నారు. ప్రభుత్వం మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా ఉపాధ్యాయ స మస్యలను పరిష్కరించాలన్నారు. ఈకార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి పులి దేవేందర్, రాష్ట్ర అధ్యక్షుడు ఎం.చెన్నయ్య, ప్రధాన కార్యదర్శి భిక్షగౌడ్, గౌరవ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, జిల్లా బాధ్యులు నర్సింహారాములు పాల్గొన్నారు.

రైలు నుంచి పడి గుర్తు తెలియని ప్రయాణికుడి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

గిర్మాజీపేట, ఫిబ్రవరి 2: వరంగల్ రైల్వేగే టు సమీపం లోని చిన్న బ్రిడ్జిపై గురువారం రాత్రి వరంగల్ నుంచి న్యూఢిల్లీ వెళ్తున్న రైలు నుంచి ప్రమాద వశాత్తు పట్టాలపై పడి గుర్తు తెలియని ప్రయాణికుడు (28) మృతి చెందినట్లు వరంగల్ జీఆర్‌పీ సీఐ జి.నరేష్ శుక్రవారం తెలిపారు. మృతుడు 5 అడుగుల 6 అంగుళాల ఎత్తు, ఎరుపు రంగు శరీరం, నల్లని తల వెంట్రుకలు, నలుపు రంగు గడ్డం, పొ ట్టపై పుట్టుమచ్చ కలిగి పోలో కంపెనీ బ్లూకలర్ జీన్స్ ప్యాంటు, రెడ్ కలర్ ఫుల్ టీషర్టు, బ్లాక్ కలర్ ఫుల్ డ్రాయర్ ధరించి ఉన్నాడని తెలిపారు. రైలు లోంచి ప్రమాదవశాత్తు జారి పడి మృతిచెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని మార్చురిలో భద్రపరిచినట్లు చెప్పారు. మృతుడి గుర్తింపు కోసం వరంగల్- న్యూఢిల్లీ, వరంగల్-హైదరాబాద్ మార్గాల్లోని రైల్వే పోలీసుస్టేషన్‌లకు సమాచారం పంపించి, ఎస్సై ఎం.అయిలయ్య కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

గంగదేవిపల్లిని సందర్శించిన విద్యార్థులు

గీసుగొండ, ఫిబ్రవరి 2: జాతీయ ఆదర్శ గ్రామం గంగదేవిపల్లిని దేశా యిపేటలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు 200 మంది శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం, సాధించిన అవార్డులు, గ్రామాభివృద్ధి కమిటీల పనితీరు ను విద్యార్థులకు జిల్లా ట్రెయినింగ్ మేనేజర్ కూసం రాజమౌళి వివరించారు. అనంతరం గ్రామ శివారులో వివిధ పంటలను పరిశీలించారు.

కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కళ్యాణ్‌రాం, ఉపాధ్యాయులు జ్యోతి, సంధ్యారాణి, షమీమ్, భవాని, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సలహాదారుడు రవిని కలిసిన ఎర్రబెల్లి స్వర్ణ దంపతులు



వర్ధన్నపేట, ఫిబ్రవరి 2 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు రవిని శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ వరద రాజేశ్వర్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో ఘనంగా సన్మానించారు.

టైర్ల మాయంపై ఫిర్యాదు

పర్వతగిరి, ఫిబ్రవరి 2 : మండలంలోని చౌటపెల్లి గ్రామ పంచాయతీకి చెందిన ట్రాక్టర్ టైర్లు మాయమైన ఘటనలో బాధ్యులను గుర్తించాలని శుక్రవారం పంచాయతీ కార్యదర్శి విజయ్‌రావు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీకి చెందిన ట్రాక్టర్ ఇంజన్, వాటర్ ట్యాంకర్ టైర్లు పోయాయని ఈ నెల 22వ తేదీన డ్రైవర్ సారంగపాణి తమ దృష్టికి తీసుకురాగా, క్షేత్రస్థాయిలో విచారణజరిపినట్లు తెలిపారు. నాలుగు టైర్లు పోయిన విషయం తేలడంతో ఘటనపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు

దుగ్గొండి, ఫిబ్రవరి 2 : మండలంలోని మల్లంపల్లిలో శుక్రవారం ప్రమాదవశాత్తు తాటి చెట్టు నుంచి పడగా గీత కార్మికుడైన తడుక రాజుకు గాయాలయ్యాయి. గ్రామస్థుల కథనం ప్రకారం.. రోజు వారిగానే గీతకార్మికుడై తడుక రాజు కల్లు తీయడానికి తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారిపడగా కాలుకు, తలకు గాయాలయ్యాయి. గాయపడిన రాజును చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. గాయపడిన రాజును తాజా మాజీ సర్పంచ్ చుక్క రమేశ్, తాజా మాజీ ఉప సర్పంచ్ తడుక కొంరెల్లి, గౌడ సంఘం నేతలు గుండెబోయిన రమేశ్, కక్కెర్ల కుమారస్వామి, మధు, చుక్క రాజేందర్, నవీన్‌గౌడ్, చంద్రమౌళి, ప్రశాంత్, కర్ణాకర్‌లు పరామర్శించారు.

రాయపర్తి పీఎస్‌ను తనిఖీ చేసిన సీపీ


పోలీస్ స్టేషన్‌ను తనిఖీచేస్తున్న కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

రాయపర్తి, ఫిబ్రవరి 2 : రాయపర్తి పోలీస్ స్టేషన్‌ను గురువారం రాత్రి వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించి, సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల పోలీసులు గౌరవంగా ఉండాలని సూచించారు. వచ్చిన ఫిర్యాదులకు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

చెరువులో మహిళ మృతదేహం లభ్యం


మహిళ మృతదేహం

పర్వతగిరి, ఫిబ్రవరి 2 : మండలంలోని అన్నారం షరీఫ్ గ్రామ దర్గాచెరువులో శుక్రవారం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. ఎస్సై ఇమ్మడి వీరభద్రరావు తెలిపిన వివరాల ప్రకారం... దర్గా చెరువులో మహిళ మృతదేహం పైకి తేలిందని స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు మృతదేహాన్ని వెలికితీసినట్లు తెలిపారు. మహిళ చామన ఛాయ రంగు, 5.4 ఫీట్ల ఎత్తు, 20-25 ఏళ్ల మధ్య వయసు కలిగి, నలుపు రంగు పంజాబీ డ్రెస్ ధరించిందని, ఎవరికైనా వివరాలు తెలిస్తే ఎస్సై పర్వతగిరి 8172 685242, సీఐ పర్వతగిరి 8712685241,పోలీస్‌స్టేషన్ పర్వతగిరి 87126850288 నెంబర్లలో తెలిపాలని సూచించారు.

పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి


ఇల్లందలో మాట్లాడుతున్న హెచ్ఎం విజయ

వర్ధన్నపేట రూరల్, ఫిబ్రవరి 2 : జరగబోయే పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా పనిచేయాలని ఇల్లంద కాంప్లెక్స్ హెచ్ఎం విజయ సూచించారు. శుక్రవారం మండలంలోని చెన్నారం, నల్లబెల్లి, కేజీబీవీ, ఉప్పరపెల్లి, కట్ర్యాల పాఠశాలల్లో ఓరియంటేషన్ కార్యక్రమాలు నిర్వహించి, మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, వారిలో ఉన్న ప్రతిభను గుర్తించి దశల వారీగా తరగతులు నిర్వహించాలన్నారు. వెనుబడిన వారినిసైతం గుర్తించి మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌లు ప్రభ, రాజు, మనుజేందర్‌రెడ్డి, వంశీమోహన్, హసన్ అలీ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

చెన్నారావుపేట, ఫిబ్రవరి 2 : మండలంలోని అమీనాబాద్ గ్రామ మోడల్ పాఠశాలలో అడ్మిషన్‌ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసన్న శుక్రవారం తెలిపారు. 6వ తరగతిలో 100 సీట్లు, 7, 8, 9, 10వ తరగతుల్లో మిగిలిన సీట్లకు ఆన్‌లైన్ సెంటర్‌లో, మీ సేవ కేంద్రాల్లో అప్లై చేసుకోవాలన్నారు. ఈ నెల 22 వరకు మోడల్ పాఠశాలలో సైట్‌లో ఆధార్ కార్డు, ఫోటో, స్టడీ, సర్టిఫికెట్‌లతో దరఖాస్తులను చేసుకోవాలన్నారు.

పట్టభద్రుల ఓటర్ల నమోదు కాంగ్రెస్ మండల ఇన్‌చార్జ్‌గా కుమారస్వామి

దుగ్గొండి, ఫిబ్రవరి 2 : మండలంలోని గోపాలపురానికి చెందిన కానుగుల కుమారస్వామిని పట్ట భద్రుల నమోదు కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జ్‌గా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఎర్రెల బాబులు శుక్రవారం నియమించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్లు ఒలిగె నర్సింగరావు, చెన్నూరి కిరణ్‌రెడ్డి, లోను శ్రీనివాస్, గిన్నె స్వామి, ఒద్దుల రఘుపతిరెడ్డి, ఎస్, రాజు, రాజేందర్, ఆగయ్య, చిరంజీవి, నవీన్ రాజేందర్ పాల్గొన్నారు.